ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శుక్రవారం 28, ఫిబ్రవరి 2025



ఊరేగింపులో నిర్మమహేశ్వరుడి రథం

రథంపై ఉత్సవ మూర్తులుగా పార్వతీసమేత నిర్మమహేశ్వరుడు



పొదిలిలో రథోత్సవంలో పాల్గొన్న వేలాది భక్తజనం

నాగేంద్రహారాయ.. త్రిలోచనాయ..!

కన్నులపండువగా నిర్మమహేశ్వరుడి రథోత్సవం

'హరోంహర..', హరహర మహాదేవ'.. శివనామస్మరణతో పొదిలి పట్టణం హోరెత్తింది. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వరస్వామి రథోత్సవంలో భక్తజనం పోటెత్తింది. రంగురంగు పూలతో రథాన్ని, స్వామివారిని రమణీయంగా అలంకరించారు. స్వామివారిని గౌరీశంకరుల అలంకరణలో చూసి జనం భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. మహిళలు, పురుషులు పోటీపడి రథాన్ని ముందుకు లాగారు. -పొదిలి, ఆంధ్రజ్యోతి

7

కదలకపోతే కుదరదు!

- కుర్చీలకు పరిమితమైతే సహించం
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- వైపాలెం నియోజకవర్గస్థాయి సమీక్షలో కలెక్టర్

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న పథకాలు, సర్వే, చెత్త సేకరణ తదితర అంశాల్లో రాష్ట్రంలోని మన జిల్లా 23వ స్థానంలో ఉంది. అధికారులు కుర్చీలకు పరిమితమైతే కుదరదు. క్షేత్రస్థాయిలో విధిగా పర్యటించాల్సిందే' అని కలెక్టర్ తమీమ్ అన్సారీయా అధికారులను హెచ్చరించారు. గురువారం ఎర్రగొండపాలెం నియోజకర్గంలో విస్తృతంగా పర్యటించారు. పెద్దరావీడు, పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం మండలాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం నియోజకవర్గంలోని ఐదు మండలాలల అధికారులతో ఎర్రగొండపాలెంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి ఎంపీడీవో బండారు శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పి-4 సర్వే, చిల్డ్రన్స్ ఆధార్ నమోదు, స్వచ్ఛదివస్, చెత్త సంపద తదితర వాటిలో అధికారులు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. మండలస్థాయి



రామచంద్రాపురంలో రీ సర్వేపై సూచనలిస్తున్న కలెక్టర్ అన్సారియా

అధికారులు కార్యాలయంలో ఉండి సచివాలయ సిబ్బంది చెప్పిందే పరిధిలోకి తీసుకొని పనిచేస్తున్నట్లు గుర్తించానని తెలిపారు. రానున్న రోజుల్లో అలా కుదరదన్నారు. తప్పనిసరిగా ఒక్కో పంచాయతీకి ఒక్కో మండలస్థాయి అధికారి పర్యటించి సమస్యలు అక్కడిక్కడే పరిష్కరించాలన్నారు. అలా లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. భూముల రీసర్వే ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రత్యేకంగా అధికారులతో సమీక్షించారు. మండలంలోని రామచంద్రాపురంలో సర్వేనంబరు 45, 41, 37-1 తదితర నంబర్లలోని జరుగుతున్న రీసర్వేను ఆమె పరిశీలించారు. అక్కడ పశువుల కొష్టాలను ఇతరులు ఆన్‌లైన్ చేసుకున్నారని కలెక్టర్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. పూర్తి నివేదిక ఇవ్వాలని మార్కాపురం సబ్ కలెక్టర్, వైపాలెం ఇన్‌చార్జి తహసీల్దారును కోరారు.

వెలిగొండ.. వెలిగేనా?

- కీలక దశలో పలు పనులు
- భారీగా నిధులు కేటాయిస్తేనే ముందుకు..
- పునరావాసం, పరిహారం కోసం ఎదురుచూపు
- నేడు శాసనసభలో వార్షిక బడ్జెట్ ప్రతిపాదన అంచనా
- పలు ఇతర రంగాలకు ప్రాధాన్యత కోరుతున్న ప్రజానీకం



వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితేనే జిల్లాకు మంచి రోజులొస్తాయి. శుక్రవారం ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు మణిహారం లాంటి వెలిగొండ ప్రాజెక్టుకు కేటాయింపులు గతం కన్నా భారీగా పెరిగితేనే దానిని పూర్తిచేసే అవకాశం ఉంటుంది. దీనితోపాటు ఇతర మౌలిక రంగాలు, అభివృద్ధి అంశాల్లో జిల్లాకు నిధులు కేటాయించాలి.

ఒంగోలు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు నిధుల సమస్య పెద్ద అడ్డంకి మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక తగినన్ని నిధులిచ్చి వెంటనే పూర్తిచేస్తుందనే ఆశలతో జనం ఉన్నారు. శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టే బడ్జెట్‌నే జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు.

రూ.2వేల కోట్లు ఇవ్వాలని...

వెలిగొండ ప్రాజెక్టు తాజా అంచనాల ప్రకారం సుమారు రూ.9,500 కోట్ల మేర వ్యయమయ్యే అవకాశం ఉంది. ఇప్పటి వరకు సుమారు రూ.6వేల కోట్లకుపైగా వ్యయం చేశారు. వెలిగొండ, గుండ్లకమ్మ, రామతీర్థం, పాలేరు రిజర్వాయర్లకు కూడా నిధులు అవసరం ఉంది. వీటన్నింటికి కలిపి సుమారు రూ.2వేల కోట్లు రానున్న ఏడాదికి అవసరమని అధికారులు ప్రభుత్వం దృష్టికి తెసుకెళ్లారు.

వైసీపీ వదిలేసింది.. కూటమి ఖర్చు పెట్టింది..


వైసీపీ ప్రభుత్వంలో 2023-24లో వెలిగొండకు కేవలం రూ.101 కోట్లు కేటాయించి రూ.25 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. అసంపూర్తి ప్రాజెక్టునుజాతికి అంకితం చేసింది. కూటమి ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో వెలిగొండకు రూ.393.49 కోట్లు, గుండ్లకమ్మకు రూ.13 కోట్లను కేటాయించగా ఇప్పటి వరకు సుమారు రూ.320 కోట్లు వరకు ఖర్చుచేసింది. వెలిగొండ కేటాయింపుల్లో నిర్మాణ పనులకు రూ.248 కోట్లు కేటాయిస్తే రూ.250 కోట్లకుపైగా ఖర్చు చేసింది. రానున్న ఏడాదికి వెలిగొండ నిర్వాసితులకు కనీసం రూ.800 కోట్లు అవసరంగా అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ నిధులతో పాటు మరో రూ.300 కోట్ల వరకు నిర్మాణ పనులకు కలిపి ఆ ప్రాజెక్టుకే వెయ్యి కోట్లకుపైగా ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గుండ్లకమ్మతో పాటు పాలేరు రిజర్వాయర్, రామతీర్థం ప్రాజెక్టులు, ఉమ్మడి జిల్లాలోని కొరిశపాడు ఎత్తిపోతల ఇతర మధ్యతరహా ప్రాజెక్టులకు నిధులు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇతర పథకాలకు నిధులు

పాలేరు రిజర్వాయర్‌కు నిధులు కేటాయించి పనులు పునఃప్రారంభించాలని మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి జలవనరులు, ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరినట్లు సమాచారం. ఆంధ్రకేసరి యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ నిర్మాణాలు దొనకొండ కారిడార్ కనిగిరి నిమ్జ్‌లలో పారిశ్రామిక అభివృద్ధితోపాటు ఫిషింగ్ హార్బర్ నిర్మాణం, చదలవాడ పశుక్షేత్రం అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ ప్రజానీకం నుంచి బలంగా వస్తోంది.

క్యాన్సర్ స్క్రీనింగ్‌కు శ్రీకారం

జిల్లావ్యాప్తంగా 18.61 లక్షల మందికి నిర్వహించనున్న ప్రభుత్వం



ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్యాన్సర్ వ్యాధిని గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ మొదలైంది. కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధిని గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ఈనెల 17న ఒంగోలు సమీపంలోని ఏడుగుండ్లపాడులో క్యాన్సర్‌పై జరిగిన అవగాహన సదస్సులో రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సినీ నటి, ఎగెయిన్ ఫౌండేషన్ నిర్వాహకులు గౌతమి పాల్గొన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంత్రి సత్యకుమార్ కూడా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. జిల్లావ్యాప్తంగా 18 ఏళ్ల పైబడిన వారందరికీ ఈ పరీక్షలు నిర్వహించేందుకు వైద్యరోగ్యశాఖ సిద్ధమైంది. ఈ టెస్టుల ద్వారా ముందుగానే గుర్తిస్తే వ్యాధిని నివారించేందుకు అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా జిల్లాలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్యాన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తించేందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు.

స్క్రీనింగ్‌లో గుర్తించే క్యాన్సర్లు

వైద్యులు స్క్రీనింగ్‌లో నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారం (సర్వేకల్) క్యాన్సర్లను పరీక్షలు నిర్వహిస్తున్నారు.

నమస్కరించి....నగదు అందజేయాలి

- పింఛన్ల పంపిణీలో కొత్త మార్గదర్శకాలు
- లబ్ధిదారుల ఇంటి వద్దకెళ్లి ఇవ్వాలి
- 300 మీటర్లు దాటి ఇస్తే యాప్‌లో కారణం నమోదు చేయాలి
- జిల్లాలో రేపే పింఛన్ల అందజేత
- ఉదయాన్నే 7 గంటల నుంచి ప్రారంభం
- 2,85,331 మంది లబ్ధిదారులకు రూ.124.22 కోట్లు

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'పెద్దయ్యా... పెద్దమ్మా... నమస్కారం... ఇదిగో మీ పింఛన్ సొమ్ము.. జాగ్రత్తగా లెక్కపెట్టుకోండి.. మన ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీనే మీ పింఛన్ సొమ్మును మీ ఇంటికే పంపిస్తుంది.. మీకు ఎలాంటి ఇబ్బందీ కలుగకుండా గౌరవప్రదంగా ప్రతినెలా పింఛన్ అందజేయాలన్నదే లక్ష్యం..' అంటూ పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి కొత్త మార్గదర్శకాలు విడుదలయ్యాయి. పింఛన్ సొమ్ము ప్రభుత్వం ఇచ్చే దానధర్మంలా కాకుండా వారికి గౌరవప్రదంగా అందజేయాలని ప్రభుత్వ నుంచి స్పష్టమైన ఆదేశాలు వెలువడ్డాయి. మార్చి ఒకటో తేదీన సిబ్బంది అనుసరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 2,85,331 వివిధ రకాలైన పింఛన్లు ఉండగా వీరికి లబ్ధిని అందజేయటానికి ప్రభుత్వం రూ.124,22,09,500 విడుదల చేసింది. ఈ సొమ్మును సచివాలయం సిబ్బంది శుక్రవారం బ్యాంకుల నుంచి డ్రా చేయనున్నారు. ఇప్పటివరకు పింఛన్ పంపిణీని ఉదయం 6 గంటలకే ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉదయాన్నే లబ్ధిదారులు నిద్రలేవకపోవటం తదితర కారణాలతో పాటు తెల్లారకముందే పంపిణీ చేయటం వల్ల పెద్దగా ప్రయోజనం లేదని భావించిన ప్రభుత్వం మార్చి నెల నుంచి ఒకటో తేదీ నుంచి ఉదయం 7 గంటల నుంచి పంపిణీని ప్రారంభించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.



ఇంటి నుంచి 300 మీటర్లలోపే పింఛన్ ఇవ్వాలి

పింఛన్‌దారుల ఇంటికి 300 మీటర్లలోపే పింఛన్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటివరకు కొంతమంది సిబ్బంది పింఛన్‌దారులను గ్రామంలోని ఒక ప్రాంతానికి పిలిపించి సొమ్మును అందజేస్తున్నారు. ఇక నుంచి అలాకాకుండా గడపగడపకు వెళ్లి లబ్ధి అందజేయాల్సి ఉంది. ఒకవేళ పింఛన్‌దారుడికి ఇంటి 300 మీటర్లు పరిధి దాటి డబ్బులు అందజేసే పక్షంలో ఏ కారణం చేత అలా చేయాల్సి వచ్చిందో ఆ కారణాన్ని యాప్‌లో నమోదు చేసిన తర్వాతే ఇవ్వాల్సి ఉంది.

415 మంది కిడ్నీ బాధితులకు పింఛన్ నిలిపివేత

జిల్లాలో మొత్తం 494 మంది కిడ్నీ బాధితులకు నెలకు రూ.10వేల వంతున పింఛన్ అందుతుండగా ఇందులో 415 మందికి పంపిణీని నిలిపివేశారు. గత రెండు నెలలుగా వీరికి ఆపేశారు. 494 మంది బాధితులపై రెండు నెలల క్రితం పరిశీలన జరిపారు. తిరిగి వైద్యపరీక్షల కోసం వీరిని రిమ్స్ వైద్యశాలకు రమ్మని సమాచారం పంపించారు. వీరిలో బోగస్‌ను గుర్తించేందుకు తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించాలని సమాచారం పంపించారు. అయితే ఇందులో 415మంది వైద్యపరీక్షలకు హాజరుకాలేదు. దీంతో వీరిని బోగస్‌గా గుర్తించారు. వీరికి గత రెండు నెలలుగా పింఛన్‌ల పంపిణీ నిలిపివేశారు.

1,477 మంది హెచ్ఐవీ బాధితులకు డీబీటీ పద్ధతిలో..

జిల్లాలోని 1,477 మంది హెచ్ఐవీ బాధితులకు ప్రతినెలా రాష్ట్రప్రభుత్వం పింఛన్లను పంపిణీ చేస్తోంది. ఇతర పింఛన్‌దారులకు ఇంటింటికీ వెళ్లి అందజేస్తుండగా హెచ్ఐవీ బాధితులకు మాత్రం వారి బ్యాంకు ఖాతాలకు సొమ్మును జమచేస్తోంది. చాలాకాలం ఇదే పద్ధతిన పింఛన్‌ను అందజేస్తోంది.

మున్సిపల్ కమిషనర్లు.. ఎంపీడీవోలకు సూచనలు

ప్రస్తుతం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు పీడీ నారాయణ శిక్షణలో ఉన్నారు. ఆయన శిక్షణ కోసం విజయనగరం వెళ్లారు. దీంతో వెలుగు పీడీ ఇన్‌చార్జి బాధ్యతలను జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవికి అప్పగించారు. దీంతో ఆయన మార్చి ఒకటో తేదీన జరగాల్సిన పింఛన్ల పంపిణీపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు తగిన సూచనలు చేశారు.

గెలాక్సీపురంలో ఆక్రమణల పర్వం

కలెక్టర్ ఆదేశాలతో సర్వే నిర్వహించిన అధికార యంత్రాంగం ● గరికమిట్టలో ఆక్రమణలు జరిగాయని ప్రాథమికంగా నిర్ధారణ


సర్వే నిర్వహిస్తున్న అసిస్టెంట్ సర్వేయర్, టీపీఎస్


కలుషితజలాలుతో చాకలికుంట


కుంట భూముల్లో అక్రమ నిర్మాణం

చీమకుర్తి, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి) : గెలాక్సీపురంగా పేరుగాంచిన చీమకుర్తి పట్టణంలో చోటుచేసుకున్న ఆక్రమణల పర్వాన్ని నిర్ధారించటానికి అధికార యంత్రాంగం ఎట్టకేలకు రంగంలోకి దిగింది. పట్టణంలోని 20వవార్డు పరిధిలోని గరికమిట్టలో సర్వేనంబర్ 449-1, 449-2లలో ఉన్న కుంటభూములు(చాకలికుంట), 454 నంబర్‌లో ఉన్న డొంక పోరంబోకు భూముల్లో గురువారం మండల డిప్యూటీ సర్వేయర్, మున్సిపాలిటీ ఇన్‌చార్జి టీపీఎస్‌ల పర్యవేక్షణలో సర్వే నిర్వహించారు. ప్రభుత్వానికి చెందిన ఈ భూముల్లో కొంతమంది వ్యక్తులు ఆక్రమ నిర్మాణాలు చేపట్టారని, దీనివల్ల పట్టా భూమిలో ఉన్న తన స్థలానికి వెళ్లే రహదారి లేకుండా పోయిందని, దీనిపై చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని పట్టణానికి చెందిన భూమా ఆంజనేయులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనికి తోడు రజకసంఘ నాయకులు తమ జీవనానికి ఆధారమైన చాకలికుంట భూములను ఆక్రమించుకొనటంతో పాటు మురుగునీటిని కుంటలోకి వదలటం, సాగర్ జలాలు కుంటలోకి రాకుండా కాలువను పూడ్చివేసి ఆక్రమణలు చేపట్టారని, దీనిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. వీటిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ బ్రహ్మయ్య, అధికార యంత్రాంగంచే సదరు భూముల్లో సర్వే నిర్వహించారు. కాగా కుంటభూముల్లో ప్రైవేటు వ్యక్తులు ఆక్రమణలు చేపట్టినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అయితే ఈ ఆక్రమణలకు పట్టాలను మంజూరు చేశారా లేదా అని రికార్డుల్లో పరిశీలించి ఎంతమేరకు భూములు ఆక్రమణకు గురయ్యాయనే విషయంతో పూర్తిస్థాయి సర్వే రిపోర్టుని ఉన్నతాధికారులకు నివేదిస్తామని అసిస్టెంట్ సర్వేయర్ యువరాజు తెలిపారు.

ఆక్రమణలను వెంటనే తొలగించాలి

గరికమిట్టలో నెలకొన్న ఆక్రమణలను వెంటనే తొలగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. రెండేళ్ల నుంచి అధికారుల చుట్టూ ఆక్రమణలను తొలగించాలని కోరుతూ తిరుగుతూనే ఉన్నాను. ఈరోజు నిర్వహించిన సర్వేలో మండల సర్వేయర్ లేకుండా అసిస్టెంట్ చేత సర్వే చేయించారు. పూర్తిస్థాయిలో సర్వే జరిపి ఆక్రమణల నిగ్గు తేల్చి వాటిని తొలగించాలి.

- భూమా ఆంజనేయులు, ఫిర్యాదుదారుడు

ఇప్పటికి మూడుసార్లు సర్వే చేసి నిర్ధారించాం

చీమకుర్తి పట్టణంలోని గరికమిట్టలో ఆక్రమణలు చోటుచేసుకున్నాయనే ఫిర్యాదులు రావటంతో ఈరోజు నిర్వహించిన సర్వేతో మూడుసార్లు జరిపాం. జరిగిన ఆక్రమణలపై నివేదికను మున్సిపల్ కమిషనర్‌కి అందజేశాం. అయితే ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కమిషనర్ చేతిలో ఉంది.

- బ్రహ్మయ్య, తహసీల్దార్

చట్టప్రకారం ఆక్రమణలు తొలగిస్తాం

గరికమిట్టలో చోటుచేసుకున్న ఆక్రమణలపై రెవెన్యూ అధికారుల నుంచి నివేదిక అందిన వెంటనే చటప్రకారం చర్యలు చేపడతాం. ఉన్నతాధికారులకు ఆక్రమణలపై నివేదించి వారి ఆదేశాల మేరకు నడుచుకుంటాం. చాకలికుంటను పరిరక్షిస్తాం.

- వై.రామకృష్ణయ్య, కమిషనర్, చీమకుర్తి మున్సిపాలిటీ

రేషన్ సరుకులను సక్రమంగా అందజేయాలి


మాట్లాడుతున్న డీటీ రాజ్యలక్ష్మి

సంతనూతలపాడు, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): కార్డుదారులకు రేషన్ సరుకులను సక్రమంగా అందించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ బి.రాజ్యలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ రేషన్ షాపుల్లో రికార్డులకు, ఉన్న సరుకుల నిల్వకు సరిపోవాలని, అధికధరలకు విక్రయించరాదని తెలిపారు. రేషన్‌షాపు వద్ద ఏర్పాటు చేసిన బోర్డుపై విధిగా డీలరు పేరు, ఆ రోజు అందించనున్న రేషన్ సరుకుల వివరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏమైనా ఫిర్యాదులు వస్తే మాత్రం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో 37మంది రేషన్ డీలర్లు, 9 మంది ఎండీయూ ఆపరేటర్లు ఉన్నారన్నారు. వీరిలో 12 మంది మాత్రమే రెగ్యులర్ డీలర్లు అని తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ గుణవంశీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోసాని అరెస్టు దుర్మార్గం : వైసీపీ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : సినిమా రచయిత, వైసీపీ నాయకుడు పోసాని మురళీకృష్ణను అన్యాయంగా అరెస్టు చేశారని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకర్‌రావు ఆరోపించారు. గురువారం ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోసాని సర్జరీ చేయించుకున్న తర్వాత తాను రాజకీయాలపై మాట్లాడనని చెప్పారని, అయినా ప్రభుత్వం అన్యాయంగా అరెస్టు చేశారని విమర్శించారు. ఇటువంటి అరెస్టుల ద్వారా ఎవరూ భయపడరన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

డీఆర్వోకు స్పెషల్ గ్రేడ్ స్కేలు కల్పిస్తూ ఉత్తర్వులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ కలెక్టర్‌గా 12 ఏళ్ళ సర్వీసును పూర్తి చేసుకున్న జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేషుకు స్పెషల్ గ్రేడ్-2 స్కేలు కల్పిస్తూ భూ పరిపాలనా ప్రధానకార్యదర్శి ఆర్‌పీ.సిసోడియా గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. డిప్యూటీ కలెక్టర్‌గా చినోబులేషు ఉద్యోగోన్నతి పొంది 12ఏళ్లు పూర్తికావడంతో ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్-2 స్కే లును కల్పించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈసారి జరిగే ఉద్యోగోన్నతుల్లో ఆయన తగిన పోస్టు లభించనుంది.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుర్చీల బహూకరణ


కుర్చీలను అందజేసిన క్లబ్ ప్రతినిధులు

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని మతా శిశు వైద్యశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు లెజెండరీ సిటిజన్స్ ఆధ్వర్యంలో రూ.80వేలు విలువ చేసే ఎయిర్‌పోర్టు కుర్చీలను బహూకరించారు. గురువారం హాస్పిటల్‌లోని వైద్యశాల సూపరింటెండెంట్ వెంకట్రావుకు వాటిని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ హాస్పిటల్‌కు వచ్చే పేషెంట్‌లకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ ప్రెసిడెంట్ అడపాల అయ్యప్ప మాట్లాడుతూ ఆసుపత్రిలో అవసరాన్ని గుర్తించి క్లబ్ ఆధ్వర్యంలో చేయూత ఇవ్వాలని అడిగిన వెంటనే డాక్టర్ జయకిషోర్, ఎం.నరసింహారావు, సొల్లేటి వెంకట్ అతని మిత్రులు ముందుకొచ్చి సహకరించారని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ రీజియన్ చైర్మన్ చిట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జోన్ చైర్మన్ నయనాల రామకృష్ణ, ఫౌండర్ ఎం.నరసింహారావు, మాజీ ప్రెసిడెంట్ జీవీ.సుబ్బారావు, అడుసమల్లి వెంకట్రావు, మేడిశెట్టి సుబ్బారావు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మద్దిపాడు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు సమీపంలో బుధవారం రాత్రి కారు ఢీకొని తీవ్రంగా గాయపడిన కోనంకి నరసయ్య(50) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కొనకనమిట్ల మండలం పెదారవీడుకు చెందిన నరసయ్యకు ప్రమాదం జరిగిన వెంటనే ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మద్దిపాడు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

అంకమ్మరావుకు నాగభైరవ సాహిత్య పురస్కారం


అంకమ్మరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావును నాగభైరవ సాహిత్య ప్రతిభా పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవి దివంగత నాగభైరవ కోటేశ్వరరావు పేరుతో నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ ప్రతి ఏడాది ప్రతిభావంతులైన సాహితీవేత్తలకు ఈ పురస్కారాన్ని అందజేస్తున్నారు. గురువారం సాయంత్రం గుంటూరు బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై ఏర్పాటుచేసిన పురస్కార ప్రదానసభను ప్రముఖ కవి డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు నిర్వహించారు. ప్రముఖ రచయిత డాక్టర్ జక్కంపూడి సీతారామారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి పెంట్యాల శ్రీమన్నారాయణ మాట్లాడుతూ కవిగా సామాజిక ప్రయోజనాన్ని ఆశించి ఎంతోమంది యువకవులను తయారుచేసిన ఘనత నాగభైరవ కోటేశ్వరరావుదని, ఆయన పేరుతో పురస్కారం అందజేయం అభినందనీయమని చెప్పారు. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ అంకమ్మరావు దశాబ్దాల సాహితీప్రస్థానంలో ఎన్నో మంచి సాహిత్య కార్యక్రమాలు నిర్వహించటమే కాకుండా అనేక పుస్తకాలను సైతం రచించారని కొనియాడారు. మరొక పురస్కార గ్రహీత శెట్టిం చంద్రమోహన్ గురించి ప్రముఖ రచయిత మోదుగుల రవికృష్ణ ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ చేయించుకోవాలి : ఏవో

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): రైతులు తాము సాగు చేసిన పంటలను తప్పక ఈ-క్రాప్ చేయించుకోవాలని, అపుడు మాత్రమే పంటల దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఏవో జీకిషోర్‌బాబు పేర్కొన్నారు. ఒంగోలు మండలం కొప్పోలు, చెరువుకొమ్ముపాలెం గ్రామాల్లో గురువారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. యూనిక్ నంబరు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలను గుర్తించాలి

టెలీ కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్లకు మంత్రి స్వామి ఆదేశం ● పొజిషన్ ధ్రువీకరణ పత్రాల్లో జాప్యం చేయొద్దని సూచన


టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి స్వామి

కొండపి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు అనువైన ప్రభుత్వ భూములను గుర్తించాలని, పేదల గృహ నిర్మాణ రుణాలు పొందేందుకు అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రాలు జాప్యం లేకుండా ఇవ్వాలని డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం టంగుటూరు మండలంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్‌లో కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్‌లతోపాటు ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలతో మాట్లాడారు. పేదలు ఇళ్ల నిర్మించుకునేందుకు నివాసయోగ్యమైన స్థలాలను తహసీల్దార్లు వెంటనే గుర్తించాలని ఆదేశించారు. భూ రీసర్వే జరుగుతన్న గ్రామాల్లో తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పరిశ్రమలకు భూములు కేటాయించే విషయంలో అధికారులు కలెక్టర్‌తో సంప్రదించి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు.

మంత్రిని కలిసిన పశుసంవర్థక అసిస్టెంట్లు

గ్రామ సచివాలయ పశుసంవర్థక అసిస్టెంట్లు యూనియన్ రాష్ట్ర ప్రతినిధులు గురువారం మంత్రి స్వామిని క్యాంపు కార్యాలయంలో కలిసి తమకు అటెండెన్స్ ఆప్షన్‌లో ఆధర్ ఆప్షన్‌ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

రీసర్వేలో పొరపాట్లు జరిగితే సహించం

● జేసీ గోపాలకృష్ణ హెచ్చరిక


జువ్విగుంటలో రైతులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

మర్రిపూడి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) భూముల రీసర్వేలో ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకున్నా సహించేది లేదని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ హెచ్చరించారు. గురువారం మండలంలోని జువ్విగుంటలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రీసర్వేలో భాగంగా ముందుగా రెవెన్యూ గ్రామం హద్దులను గుర్తించాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూముల హద్దులను కూడా విధిగా నిర్ధేశించాలన్నారు. పట్టాదారుల సమక్షంలోనే రీసర్వే ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. పలువురు రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రీసర్వే జరుగుతున్న తీరుతెన్నులపై ఆరా తీశారు. అనంతరం రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారంపై తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆర్వోఆర్ రికార్డుల సమస్యలపై తక్షణమే పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ జ్వాలా నరసింహం, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, డీటీ నాగరాజు, ఆర్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

కొణిజేడులో పరిశీలన

టంగుటూరు: మండలంలోని కొణిజేడులో కొనసాగుతున్న గ్రామ రీసర్వేను జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీ సర్వే అధికారులతో మాట్లాడుతూ సర్వేలో మొదటిగా విలేజ్ బౌండర్, ప్రభుత్వ భూముల బౌండరీ పూర్తి చేసిన తర్వాత మాత్రమే పట్టా భూముల గ్రౌండ్ ట్రూథింగ్ పని మొదలు పట్టాలని సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

5న ఒంగోలులో, 10న గుంటూరు రాష్ట్ర స్థాయి ధర్నాలు ● సంయుక్త కిసాన్ మోర్చా నాయకుల వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతుల ఉద్యమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు వచ్చేనెల 5న ఒంగోలులో, 10వ తేదీన గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి ధర్నాలను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక మాదాల నారాయణస్వామి భవన్‌లో గురువారం సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి కె.హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ జాతీయస్థాయిలో సంయుక్త కిసాన్ మోర్చా ఐక్యతను దెబ్బతీయడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. అందులో భాగంగానే గిట్టుబాటు ధరలపై ఒప్పందం కుదురుతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మిర్చికి క్వింటాకు రూ.20వేల మద్ధతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ జామాయిల్, సుబాబుల్ కర్రకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ఏఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎంఎస్.సాయి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో విప్లవ రైతు సంఘం జిల్లా కన్వీనర్ బి.సుబ్బారావు, పలు సంఘాల నాయకులు జె.జయంతిబాబు, సీహెచ్.సాగర్, ఎల్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం


శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి నగరోత్సవం




కొత్తపట్నం బస్టాండులో శ్రీరాజరాజేశ్వరస్వామి కల్యాణం, గజవాహనంపై ఊరేగింపు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో గురువారం పలు ఆలయాల్లో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. కొత్తపట్నం బస్టాండులోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమలో అర్చకులు ఆమంచి మణికంఠ శర్మ, గూడా సాయిశర్మల యాజ్ఞీకంలో ప్రత్యేక పూజలు, మాంగల్య ధారణ, అమ్మవారికి స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ మొదలైన క్రతువులను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో బోడపాటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఇక సాయంత్రం పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించిన వాహనంపై స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి పలు ప్రధాన రహదారులలో విద్యుత్ దీపాల వెలుగులో నగరోత్సవాన్ని నిర్వహించారు.

స్థానిక కేశవస్వామిపేట శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో సైతం గురువారం తెల్లవారుజామున శ్రీపార్వతీ పరమేశ్వర కళ్యాణం అర్చకులు శంకరమంచి రామకృష్ణ శర్మ బృందం యాజ్ఞీకంలో నిర్వహించగా ఈవో ఆర్.శివశంకర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రాత్రి ప్రత్యేక వాహనంపై స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను అలంకరించి ఆలయ అర్చకబృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నగరోత్సవం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ఇక మంగమూరురోడ్డు భగవాన్‌శ్రీసత్య సాయిబాబా మందిరంలో సైతం మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి అభిషేకం, శ్రీశివపార్వతుల కళ్యాణం వైభవంగా జరిగాయి. మందిర కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంవీఆర్‌కే.ప్రసాద్, పి.సాయికృష్ణ, సీహెచ్.శ్రీరామమూర్తి, సీహెచ్.అంజనాకుమారి, ఎం.రాజేశ్వరి, సంధ్య పాల్గొన్నారు.

సంతపేట సాయిబాబా మందిరంలో ప్రముఖ వేదపండితులు మఠంపల్లి దక్షిణామూర్తి యాజ్ఞీకంలో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థాన ధర్మకర్తలు కవర్తపు బాలకృష్ణారావు దంపతులు, మందిర కమిటీ నిర్వాహకులు అళహరి చెంచలరావుల పర్యవేక్షించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పోక్సో యాక్ట్‌పై అవగాహన


మాట్లాడుతున్న రత్నప్రసాద్

కొండపి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): లింగవివక్ష, పోక్సో యాక్ట్, బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ కార్యకర్తలకు కిషోరీ వికాసం జిల్లా రిసోర్స్‌పర్సన్ రత్నప్రసాద్ గురువారం అవగాహన కలిగించారు. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల నుంచే బడికి వెళ్తారని, కేంద్రంలో కార్యకర్తలు సత్ప్రవర్తన కలిగి ఉండటంతోపాటు, వారికి ప్రాథమిక జ్ఞానాన్ని కలిగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కొండపి ప్రాజెక్ట్ పరిధిలోని కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి

● ఎంపీడీవో సురేష్‌బాబు


మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా గ్రామాలలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఫారంపాండ్స్, గోకులంషెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. గురువారం సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఏమైనా పూర్తికాని పనులు ఉంటే స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత విభాగ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతువారికుంటలు మంజూరయ్యాయని, వాటికి సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం మైనంపాడు బీసీకాలనీలో జరుగుతున్న పి-4 సర్వేను ఎంపీడీవో సురేష్‌బాబు పరిశీలించారు.


ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, మేరుగ నాగార్జున

చీమకుర్తి, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజలతో ఉండి, వారి సమస్యలు పరిష్కరించటానికి వైసీపీ నాయకులు కృషి చేయాలని జడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగ నాగార్జున కోరారు. గురువారం చీమకుర్తి పట్టణంలో నిర్వహించిన పట్టణ, మండల పార్టీ కార్యవర్గ సమావేశంలో వారు ప్రసంగించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయటానికి పదవులను ఆసక్తి గల వారికి ఇస్తామని, దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం నుంచి వేధింపులు లేవని సమావేశంలో పాల్గొన్న నాయకులతోపాటు గ్రామాల నాయకులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, క్రిస్టిపాటి శేఖరరెడ్డి, ఎం.శ్రీధర్, ఓబుల్‌రెడ్డి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చీమకుర్తి అన్నక్యాంటీన్ తనిఖీ


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

చీమకుర్తి ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణంలో నిర్వహిస్తున్న అన్నక్యాంటీన్‌ను జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ గురువారం రాత్రి తనిఖీ చేశారు. ఆహారపదార్థాల శుచి, రుచిని పరిశీలించారు. క్యాంటీన్‌కు వచ్చినవారితో భోజనం గురించి వాకబు చేశారు. వారు సంతృప్తి వ్యక్తం చేయటంతో అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా తగుసూచనలు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణయ్య, కందిమళ్ల గంగాధరరావు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

మద్దిపాడు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తాగునీటికి ఇబ్బందులు లేకుండా గ్రామపంచాయతీల్లో చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

మద్దిపాడు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యతోనే ప్రభుత్వాలు అమలుచేసే పథకాలు అందుతాయని మండల వ్యవసాయ అధికారి రమేష్‌బాబు అన్నారు. గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని లింగంగుంట, ఏడుగుండ్లపాడు గ్రామాల్లో నిర్వహించగా ఆయన రైతులతో సమావేశమయ్యారు. రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

మద్దిపాడు, ఫిబ్రవరి 27: మద్దిపాడు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా మహిళకు గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన ప్రకారం, గురువారం అద్దంకికి చెందిన సుబ్బారావు ద్విచక్ర వాహనంపై మద్దిపాడు నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా తమిళనాడుకు చెందిన దంపతులు మఎరరో వాహనంపై వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న మహిళ తలకు, మోకాళ్లకు గాయాలు కాగా అంబులెన్స్ ద్వారా ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

రమణీయం.. రథోత్సవం



పొదిలిలోని మాఢవీధుల్లో నిర్మమహేశ్వరస్వామి ఊరేగింపు

శివనామస్మరణలతో మార్మోగిన పట్టణం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. వీధివీధినా అన్నదాన కార్యక్రమాలు

పొదిలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే ప్రముఖ శైవక్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన పొదిలిలోని పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామిని గౌరీశంకరులుగా అలంకరించి అర్చక స్వాములు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. రంగురంగు పూలతో రథాన్ని, స్వామిని రమణీయంగా అలంకరించారు. మధ్యాహ్నం 2 గంటలకు రథోత్సవం ప్రారంభం కాగా, మహిళలు, పురుషులు ఎవరికి వారే పోటీపడి రథాన్ని ముందుకు లాగారు. పట్టణంలోని చినబస్టాండ్, పెద్ద బస్టాండ్, నిమ్మయ్య హోటల్, రాఘవేంద్ర సినిమాహాల్, దర్శిరోడ్డు మీదుగా రథోత్సవం సాగింది. ఆనవాయితీ ప్రకారం నిమ్మయ్య హోటల్ దాటేంత వరకు పురుషులు, అక్కడ నుండి మహిళలు రథాన్ని లాగారు. భక్తులు, ప్రజలు మండుటెండను సైతం లెక్క చేయకుండా స్వామికి వారు పోస్తూ, కాయకర్పూరం సమర్పించారు. రథచక్రాల కింద గుమ్మడికాయలు ఉంచి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 3.40 గంటలకు రథోత్సవం తిరిగి ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణం 'హరహరమహాదేవ' అంటూ శివనామస్మరణతో మారుమోగింది. ముందుగా తహసీల్దార్ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ పి.శ్రీనివాసులు, ఎస్పీ ఏ.ఆర్.దామోదర్, రథనిర్మాణ దాత సామంతపూడి నాగేశ్వరరావు, ఉభయదాతలను, ఆర్ అండ్‌బీ అధికారులను ఆలయ మర్యాదలతో ఆలయ ప్రాంగణంలోకి ఆహ్వానించారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.





రథోత్సవంలో ఆకట్టుకున్న కళారూపాలు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ దామోదర్

9552300009

ఆ నంబర్‌తో ఇంటర్ హాల్ టికెట్లు డౌన్‌లోడ్...

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం హాల్‌టికెట్ తిప్పలు తప్పించింది. విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్ లేదా వాట్సప్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ విషయంలో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేరుగా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుగావచ్చు. విద్యార్థులు 9552300009 వాట్సప్‌నెంబర్ మొదట హాయ్ అని మెసేజ్ పెట్టాలి. వెంటనే తెరపై ప్రభుత్వ సర్వీసులన్నీ కనిపిస్తాయి. అందులో విద్యాశాఖను క్లిక్ చేసి ఎంపిక చేసుకోవాలి. దానిలో విద్యార్థి ఆధార్ లేదా రోల్ నెంబరును టైప్ చేయాలి. ఆ తర్వాత విద్యార్థి పుట్టిన తేదీ, నెల, సంవత్సరం టైప్ చేయాలి. వెంటనే విద్యార్థి హాల్‌టికెట్ అదే వాట్సప్‌కు పీడీఎఫ్ ఫార్మెట్‌లో డౌన్‌లోడ్ అవుతుంది.

ఓపెన్ ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా వ్యాప్తంగా 4,175 మంది విద్యార్థులు హాజరు

21 పరీక్షా కేంద్రాలు సిద్ధం

ఈ ఏడాది నుంచి ఇంటర్‌బోర్డు పరీక్షలతోనే ఇవీ నిర్వహణ

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మార్చి 3వ తేదీ నుంచి జరగనున్న ఏపీ సార్వత్రిక విద్యా పీఠం(ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ) ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షలకు 4,175 మంది విద్యార్థులు హాజరు కానుండటంతో అందుకోసం 21 కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత ఏడాది వరకు ఏప్రిల్, మే నెలల్లో ఓపెన్ స్కూలు పరీక్షలు జరిగేవి. ఈ పరీక్షల్లో భారీగా మాస్‌కాపీయింగ్ నడుస్తుండడం, లక్షల్లో డబ్బులు చేతులు మారుతుండడంతో వీటికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. అందుకు ఇంటర్ బోర్డు ద్వారానే ఓపెన్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని పాఠశాల విద్యా కమిషనర్ ఆదేశించారు. దీనికి ఇంటర్‌బోర్డు క్షేత్రస్థాయి అధికారులు నో చెప్పడంతో ఏపీ విద్యాపీఠం ద్వారానే పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే ఇంటర్ బోర్డు పరీక్షలు, ఓపెన్ స్కూలు పరీక్షలు ఒకేసారి నిర్వహించనున్నారు. మార్చి 1నుంచి బోర్డు పరీక్షలు ప్రారంభమవుతుండగా, ఓపెన్ పరీక్షలు మాత్రం మార్చి 3నుంచి ప్రారంభమవుతున్నాయి. పరీక్షలు ఉదయం 9నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. దర్శిలో గరిష్టంగా ఆరు కేంద్రాలు, కనిగిరిలో ఐదు, గిద్దలూరు నాలుగు, ఒంగోలులో రెండు, సంతనూతలపాడులో ఒకటి, వైపాలెంలో రెండు, మార్కాపురంలో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాపీయింగ్‌ను నిరోధించేందుకు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 21మంది చీఫ్‌లు, 21 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 250 మంది ఇన్విజిలేటర్లను నియమించచారు. ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు రోజు మార్చి రోజు పరీక్షలు నిర్వహిస్తారు. 3న ఇంగ్లీషు, 5న హిందీ, తెలుగు, ఉర్దూ, 7న రసాయన శాస్త్రం, ఆర్థికశాస్త్రం, సామాజిక శాస్త్రం, 10న భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, పౌరశాస్త్రం, మనో విజ్ఞానశాస్త్రం, 12న గణితం, చరిత్ర, వ్యాపారగణిత శాస్త్రం, 15న జీవశాస్త్రం, వాణిజ్య/వ్యాపార శాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు జరుగుతాయి.

4న కొబ్బరిబొండాల వేస్ట్ సరఫరాకు వేలం

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలోని 50 డివిజన్‌లలోని కొబ్బరి బోండాల షాపుల నుంచి ఖాళీ కొబ్బరిబోండాలను సేకరించి, డంపింగ్ యార్డుకు తరలించేందుకు, వాటి నుంచి పీచు తయారీ చేసుకునే హక్కులకు మార్చి 4న వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ పూర్తి వివరాలతో కార్యాలయ పనివేళలో ఎఫ్-1 గుమస్తాను కలిసి తెలుసుకోవాలని కోరారు.

12నుంచి నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రూడ్ సెట్ సంస్థలో వచ్చేనెల 12వ తేదీ నుంచి హౌస్‌వైరింగ్‌పై ఉచిత శిక్షణను ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు అర్హులని, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు కలిగి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతిని ఉచితంగా కల్పిస్తామని, 18 ఏళ్ల పైబడిన యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8309915577 సెల్ నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు టెన్త్ చీఫ్‌లు, డీవోల సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పదో తరగతి పబ్లిక్ పరీక్షల పరీక్షాకేంద్రాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఓపెన్ సొసైటీ ఇంటర్, పదో తరగతిపరీక్షా కేంద్రాల చీఫ్‌లు, డీవోల సమావేశం శుక్రవారం స్థానిక పాత జడ్పీ సమావేశపుహాలులో నిర్వహిస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, అందువల్ల సంబంధిత అధికారులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

పారిశ్రామిక రంగంపై యువతకు ఉచిత శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చేసేందుకు ర్యాంప్ పథకం ద్వారా ఉచిత శిక్షణను ప్రారంభిస్తున్నట్లు జిల్లా పారిశ్రామిక కేంద్రం జీఎం బి.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటర్‌ప్రెన్యూర్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా ఎంఎస్ఎంఈలపై నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. స్వయం ఉపాధి ద్వారా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆయన పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు పొంది సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అవగాహన, ప్రాజెక్టు ప్రిపరేషన్, పథకాల వివరాలు, మార్కెట్‌పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. 18నుంచి 58 సంవత్సరాల లోపు ఉన్న వారు ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటో, కులధృవీకరణ పత్రం, తెల్లరేషన్‌కార్డులు తీసుకొని శుక్రవారం సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 9160607606, 7093773777 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రోజుకు 60 మందికి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

- డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో రోజుకు 60మందికి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయం నుంచి గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల జూమ్(వీడియో) కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎన్‌సీడీ, సీడీ-3ఓ కార్యక్రమం కింద రోజుకు 25నుంచి 30 కుటుంబాలు లేదా 60 మందికి తప్పనిసరిగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు జరగాలన్నారు. 18 ఏళ్లపైబడిన వారందరికీ ఈ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్ర్కీనింగ్ పరీక్షలతో పాటు అధిక రక్తపోటు, మధుమేహ పరీక్షలు కూడా నిర్వహించాలన్నారు. క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షల్లో అనుమానితుల కేసులు ఉంటే వెంటనే ఒంగోలులోని జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌కు రిఫరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్.యాప్.ఎస్ సమాచారం మేరకు ప్రకారం జనాభాలో 26శాతం మంది మధుమేహంతో, 30శాతం మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని, అటువంటి వారిని గుర్తించి సత్వర వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ, సీడీ నోడల్ అధికారి డాక్టర్ భగిరధి, డీపీఎం విక్టర్ కుమార్, డేటా మేనేజర్ చల్లా ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఆ యువకుడిది హత్యగా గుర్తింపు?

- ఒంగోలు సమీపంలో రోడ్డుపై పడి ఉన్న మృతదేహం వైజాగ్ ప్రాంత వాసిదే
- బలంగా కొట్టడంతో చనిపోయాడని పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడి
- హత్య చేసి ఉంటారనే అనుమానం
- కనిపించకుండా పోయిన అతడి స్నేహితుడు
- దర్యాప్తు చేస్తున్న తాలూకా పోలీసులు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం త్రోవగుంట వద్దగల జాతీయ రహదారిపై ఈ నెల 16న రక్తపు గాయాలతో పడి ఉన్న మృతదేహం వివరాలను ఎట్టకేలకు పోలీసులు గుర్తించారు. అతని తల వెనుక భాగాన బలమైన గాయాలు ఉండటంతో అప్పటిలో పోలీసులు రోడ్డు ప్రమాదం జరిగి ఉండవచ్చని భావించారు. పోస్టుమార్టం నివేదికలో ప్రమాదం కాదని, ఎవరో బలమైన దెబ్బలు కొట్టడంతో చనిపోయాడని తేలడంతో కేసు దర్యాప్తులో వేగం పెంచారు. ఎట్టకేలకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు మృతుడు విశాఖపట్నం జిల్లా పెద్దబైయిలు మండలం గుత్తారుపట్టుకు చెందిన లాకీ శివ(30)గా గుర్తించారు. ఈ మేరకు మృతుడి ఫొటోను ఆయన భార్య లక్ష్మి గుర్తించింది.

వివరాల్లోకి వెళితే... శివ తన భార్య లక్ష్మితో కలిసి ఆరునెలల క్రితం కొప్పోలులోని ఇంటూరి సుబ్బారావుకు చెందిన చేపల చెరువుల వద్ద కాపలాదారులుగా పనులకు వచ్చారు. ఆ పక్కనే గణేష్ అనే యువకుడు కూడా కాపలాదారుడుగా పనిచేస్తున్నాడు. సుమారు 20 రోజుల క్రితం శివ, గణేష్‌ల మధ్య గొడవ జరిగింది. ఆ తర్వాత వారు ఇరువురు కలిసిమెలిసి ఉంటూనే తరచూ మద్యం సేవిస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 16న ఇంటూరి సుబ్బారావు తన చెరువుల వద్ద కాపాలదారుడైన శివకు నిత్యావసర సరకులు, కూరగాయలు కొనిచ్చి చెరువు వద్ద వదిలిపెట్టాడు. ఆ తరువాత గణేష్, మరో యువకుడితో వచ్చి శివను బయటకు తీసుకెళ్లారని అతని భార్య లక్ష్మి చెబుతుంది. అప్పటి నుంచి తన భర్త తిరిగి ఇంటికి రాలేదని, తాను ఫోను చేసినా అది పనిచేయడం లేదని పోలీసులకు తెలిపారు. అయితే విశాఖపట్నం ఏమైనా వెళ్ళి ఉంటాడని భావించి తాను కూడా ఇంటికి వెళ్ళినట్లు లక్ష్మి పోలీసులకు వివరించింది. ఈక్రమంలో మృతదేహం రోడ్డుపై పడి ఉండటం, శివదిగా భావించి ఆయన భార్య లక్ష్మిని పిలిపించారు. తరువాత ఆమె తన భర్త ఫొటోను గుర్తించింది.

హత్యగా అనుమానం

తన భర్త శివను గణేష్, అతని స్నేహితుడు కలిసి బయటకు తీసుకెళ్లారనేందుకు ప్రత్యక్ష సాక్షి లక్ష్మి. ఆ తరువాత శివ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భర్త కనిపించకపోవడంతో చేసేదేమి లేక లక్ష్మి తమ స్వగ్రామం వెళ్లింది. అదేక్రమంలో గణేష్ కూడా కనిపించకుండా పోయాడు. ఈ పరిణామాల నేపథ్యంలో మిస్టరీ ఏమిటనే దానిపై ఒంగోలు తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు. త్వరలోనే కేసు దర్యాప్తు పూర్తి చేస్తామని తాలుకా సీఐ అజయ్‌కుమార్ చెప్పారు.

ఇంటర్ పరీక్షల్లో దివ్యాంగ విద్యార్థులకు రాయితీలు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మార్చి 1వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్‌బోర్డు పలు రాయితీలు, సౌలభ్యాలను కల్పించింది. విద్యార్థులు తమ వైకల్యాన్ని ధ్రువీకరించే పత్రాలు సమర్పించి వీటిని పొందవచ్చు. ప్రభుత్వం సదరమ్ క్యాంపుల్లో జారీచేసే ధ్రువీకరణ పత్రాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనరల్ హాస్పటళ్లు, వైకల్యానికిసంబంధించి మెరుగైన చికిత్సనందించే సూపర్ స్పెషాలిటీ హాస్పటళ్లు జారీ చేసే వైకల్య ధ్రువీకరణ పత్రాలను ముందుగా ఇంటర్ బోర్డుకు సమర్పించి రాయితీలు, సౌలభ్యాలు పొందేందుకు అనుమతి పొందాలి. జిల్లాలో 240 మంది విద్యార్థులు ఆ రాయితీలు పొందేందుకు అర్హులయ్యారు.



- దివ్యాంగ విద్యార్థులు స్వయంగా పరీక్ష రాయలేకపోతే పరీక్ష రాసేందుకు స్క్రైబ్‌ను ఏర్పాటు చేస్తారు. స్వయంగా పరీక్ష రాసుకునే వారికి పరీక్షలో అదనపు సమయం కేటాయిస్తారు. ఈ విద్యార్థులకు గంటకు 20 నిమిషాలు అదనంగా కేటాయిస్తారు. 3.15 గంటలు జరిగే పరీక్షను 65 నిమిషాలు, మూడు గంటలు జరిగే పరీక్షకు ఒక గంట, 2.45 గంటలు జరిగే పరీక్షకు 55 నిమిషాలు, 2.30 గంటలు జరిగే పరీక్షకు 50 నిమిషాలు, 2 గంటలు జరిగే పరీక్షకు 40 నిమిషాలు, 1.45 గంటల పరీక్షకు 35 నిమిషాలు, 1.30 గంటల పరీక్షకు 30 నిమిషాలు, ఒక గంట జరిగే పరీక్షకు 20 నిమిషాలు అదనంగా సమయం ఇస్తారు.
- శారీరక వైకల్యం ఉన్న విద్యార్థులకు స్క్రైబ్‌ను ఇవ్వడంతో పాటు పరీక్ష రాసేందుకు అదనపు సమయం కూడా కేటాయిస్తారు. పరీక్షల్లో కనీసం 35శాతానికి బదులుగా 10శాతం మార్కులు సాధించిన వారు ఉత్తీర్ణులైనట్లు ప్రకటిస్తారు. మూడు భాషల్లో ఒక పరీక్షకు మినహాయింపు ఇస్తారు.
- దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు కూడా కనీస ఉత్తీర్ణత మార్కులను 35నుంచి 20శాతానికి తగ్గించారు. మూల్యాంకనంలో తప్పులను పెద్దగా పట్టించుకోకుండా ఉదారంగా మార్కులు ఇస్తారు. వీరికి అవసరమైన పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లేందుకు అనుమతి ఇస్తారు. వీరికి ప్రత్యేక సమాధాన పత్రాలను ఇస్తారు. వీరికికూడా స్క్రైబ్‌ను అదనపు సమయాన్ని ఇస్తారు.
- వినికిడి లోపం ఉన్న దివ్యాంగ విద్యార్థులకు కూడా కనీస ఉత్తీర్ణత మార్కులను 35శాతం నుంచి 20శాతానికి తగ్గించారు. మూల్యాంకనంలో తప్పులను పెద్దగా పట్టించుకోరు.
- మాట లోపం, బాషావైకల్యం ఉన్న దివ్యాంగులకు కూడా కనీస ఉత్తీర్ణత మార్కులను 35 నుంచి 20శాతానికి తగ్గించారు. ఆటిజం ఉన్న దివ్యాంగులకు ఉత్తీర్ణత శాతం మార్కులను 10శాతానికి తగ్గించారు. వీరికి కూడా ప్రత్యేక సమాధాన పత్రాలు ఇస్తారు.
- మానసికస్థితి సరిగాలేని దివ్యాంగులకు ఉత్తీర్ణత మార్కులను 35శాతం నుంచి 20శాతానికి తగ్గించారు. వీరి సమాధానాల్లో కూడా భాషా దోషాలను పట్టించుకోరు. ఈ విద్యార్థులు తమకు అవసరమైన పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లేందుకు అక్కడ వినియోగించేందుకు అనుమతిస్తారు. వీరికి ఒక భాషా పరీక్ష నుంచి మినహాయింపు ఇస్తారు.

అవీ..ఇవీ

పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ



స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ దామోదర్

కొనకనమిట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండలకేంద్రం కొనకనమిట్లలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ దామోదర్ అకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో తిరిగి పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలను పెంచారని అహ్లాదకరంగా స్టేషన్ వాతావరణం ఉండేలా చర్యలు తీసుకున్న ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ను, అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మొపుతూ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.. మండలంలోని కీలక ప్రదేశాలలో సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ముల్లా మహ్మద్, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పొదిలి : జిల్లా ఎస్పీ దామోదర్ గురువారం పొదిలి పోలీస్‌స్టేషన్ను, నూతన హంగులతో నిర్మిస్తున్న సీఐ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఎలాంటి దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు మండలం మొత్తం సుమారుగా 200ల సీసీ కెమేరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. అందుకు అధికారులు తగిన ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు సుమారుగా 100కుపైగా నిఘానేత్రాలను ఏర్పాటు చేససినట్లు సీఐ, ఎస్‌ఐలు తెలిపారు. అనంతరం నిర్మమహేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ వేమన ఉన్నారు.

నాదస్వర విద్వాంసుడు జిల్లెల మృతి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగస్వర విద్యాంసుడు సంగీత మాస్టరు అయిన జిల్లెల్ల వెంకటేశ్వర్లు(80) గురువారం మృతి చెందారు. ఈ సందర్భంగా త్రివిక్రమ కళాసంఘం నాయకులు పురాణం సుబ్రహ్మణ్యం, చిత్తాది రంగనాయకులు, గాయప్రోలు వెంకటేశ్వర్లు, పీడీ వెంకటేశ్వరరావులు జిల్లెల్ల మృతికి సంతాపం తెలిపారు.

అంబవరంలో పొలం పిలుస్తోంది


రైతులతో మాట్లాడుతున్న ఏవో

గిద్దలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబవరం, వెల్లుపల్లి గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ఫార్మర్‌చార్ట్ పథకాల ఉద్దేశాలను వివరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందాలని అధికారులు పేర్కొన్నారు. ఫార్మర్ చాట్ అప్లికేషన్ ద్వారా వాతావరణంలో వచ్చే మార్పులు, పంటల మార్కెట్ ధరలు, చీడపీడలు, నివారణ గురించి తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో విజయభాస్కర్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ, సూక్ష్మనీటి యాజమాన్యశాఖ అధికారి మోహనకృష్ణ, తదితరులు పాల్గొని రైతులకు సూచనలు చేశారు.

వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలి

మార్కాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశ ప్రజల ఆశాదీపమైన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలని బీజేపీ నాయకులు గురు వారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా టన్నెల్ పనులపై ప్రత్యేక దృష్టిపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అంతేకాక ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయి మూడు దశాబ్ధాలుగా అభివృద్ధికి దూరంగా జీవనం సాగిస్తున్న ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం అందిం చాలన్నారు. వారికి సంబంధించిన పునరావాస కాలనీల్లో నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యాలయ ఏవో రవీందర్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు శాసనాల సరోజిని, బొంతల కృష్ణ, పాదర్తి ఆంజనేయులు, గుంటక వెంకటేశ్వరరెడ్డి, మొర్రిబోయిన చిన్నయ్య, మద్దె లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సమావేశం

గిద్దలూరు : పట్టణంలోని పోలింగ్ బూతు స్థాయిలో బీజేపీ శ్రేణులు సమావేశా లను నిర్వహించారు. పోలింగ్ బూత్ స్థాయిలోని బిజెపి కమిటీల అధ్యక్షులు, ఇతర ముఖ్యులతో బీజేపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పార్టీ దృష్టికి తీసుకు వచ్చి అధికారుల ద్వారా సమస్యలు పరిష్క రించి వారి మన్ననలు పొందాలన్నారు. పోలిం గ్ బూతు స్థాయిలో సక్రమంగా పని చేస్తే బీజేపీ ఓటు బ్యాంక్ పెరుగుతుందని, అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చా లని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్య క్షులు బి.వి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో తాగునీటి ఎద్దడిని నివారించండి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 27 ఆంధ్రజ్యోతి: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని మార్కాపురం ట్యాక్స్ పేయర్స్ అండ్ వినియోగదారుల సంఘం అధ్యక్షులు ఓప మల్లిక్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏఈ రామ్‌భూపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలో ఏటా వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడటం పరిపాటిగా మారిందన్నారు. బోర్లు, కొళాయిలు చాలా వరకు ఉపయోగపడని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. గత ప్రభుత్వం దేశ చరిత్రలోనే ఎన్నడూ చూడని విధంగా ఏటా 15 శాతం పన్నులు పెంచిందన్నారు. ఐదేళ్లలో 60 శాతం ఆస్తి పన్నును కూడా పెంచిందన్నారు. దీంతో మార్కాపురం పట్టణంలో పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం పడుతోందన్నారు. అయినప్పటికీ, పట్టనంలో రోడ్ల మరమ్మతులు, వీధిలైట్ల రిపేర్లు, కొళాయిల మరమ్మతులు చేయడం లేదన్నారు. నూతన ప్రభుత్వం మంచినీటికి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మద్దిపాడు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు సమీపంలో బుధవారం రాత్రి కారు ఢీకొని తీవ్రంగా గాయపడిన కోనంకి నరసయ్య చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కొనకనమిట్ల మండలం పెదారవీడుకు చెందిన నరసయ్యకు ప్రమాదం జరిగిన వెంటనే ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మద్దిపాడు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ప్రభుత్వ సేవల్లో జాప్యం తగదు

● అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరిక ● ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో విస్తృత పర్యటన


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అన్సారియా

పుల్లలచెరువు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):అధికారులు నిబద్ధతతో పనిచేస్తూ ప్రభుత్వం సేవలను వేగవంతం చేయాలని కలెక్టరు తమీమ్ అన్సారియా ఆదేశించారు. గురువారం పుల్లలచెరువు మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తహసీల్దార్ లాగిన్‌లో మ్యూటే షన్ల పెండింగ్‌ల లేకుండా పరిష్కరించుకోవాలన్నారు. కంప్యూటర్లను స్వయంగా పరిశీలించి రీసర్వే, ముటేషన్లను తీరును అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం వస్తున్నందున తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. అనంతరం ఆమె పిడికిటివారిపల్లెలో ఉపాధిహామీ ద్వారా తీస్తున్న ఇంకుడుగుంటలను పరిశీలించారు. చాపలమడుగు రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించారు. చెన్నుపల్లిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అది నిరుపయోగంగా ఉండడంపై పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంరోజుల్లో వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. అనంతరం టీడీపీ మండలం నాయకులు కాకర్ల కోటయ్య చాపలమడుగు పెద్ద చెరువును నాగర్ జలాలు మల్లించాలని కోరారు. టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కండ్లావత్ సేవ్యానాయక్ నరజాముల తాండలో 150 మందికి ఇంటి పట్టాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో మార్కపురం సబ్‌కలెక్టరు వెంకట త్రివినాగ్, మండల అధికారులు పాల్గొన్నారు.


భూముల రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

ఎర్రగొండపాలెం రూరల్ : నియోజవర్గ పరిధిలో ప్రజలు తాగు, సాగునీటి కోసం రోడ్లపైకి వస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి గ్రామంలో ఎంపీడీఓ, ఆర్‌డ బ్ల్యూఎస్, పంచాయితీ అధికారులు పర్యటించి తాగు నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు

నియోజకవర్గ పరిధిలోని పుల్లలచెరువు, దోర్నాల మండలాల ఎంపీడీవోలను కలెక్టర్ చిల్డ్రన్స్ ఆధార్ నమోదు, పి 4 సర్వే, చెత్త సంపద గురించి అడిగారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు సరిగా పని చేయాలని లేకుంటే చర్యలు తప్పవని అన్నారు.

రీసర్వే, ఇంకుడు గుంతలు పరిశీలన

మండలంలోని రామచంద్రాపురం గ్రామంలోని సర్వే నెంబరు 45, 41, 37-1 తదితర నంబర్లలోని రీసర్వేను కలెక్టర్ అధికారులతో కలసి పరిశీలించారు. అక్కడ పశువుల కొట్టాలను ఇతరులు ఆన్‌లైన్ చేసుకున్నారని కలెక్టర్‌కు గ్రామ ప్రజలు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ మ్యాప్, ఇరువురి రికార్డులు పరిశీలించారు. పూర్తి నివేదిక ఇవ్వాలని మార్కాపురం సబ్ కలెక్టర్, ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ తహసీల్దారును కోరారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ఇంకుడుగుంతలను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. అలాగే గ్రామంలో నీటిసమస్యపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాలలో పంచాయితీరాజ్, డ్వామా, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కరం చూపాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయాను ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. గురువారం ఎర్రగొండపాలెం వచ్చిన ఆమెను మండల పరిషత్ కార్యలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజవర్గంలోని నీటి సమస్య, రోడ్లు, పాఠశాల భవనాలు, భూసమస్య తదితరాలపై ఉన్న సమస్యలను ఆమెకు వివరించారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, భూదందా తదితరాలపై విచారించాలని కోరారు. వాటిపై ఆమె సానుకూలంగా స్పందించారు.

● వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి అవసరమైన నిధులు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వానికి రూ.2వేల కోట్ల నిధులు అవసరమని ఎర్రగొండపాలెం సీపీఐ నాయకులు కలెక్టర్ తమీమ్ అన్సారీయాను కోరారు. గురువారం ఎంపీడీవో కార్యలయంలో ఆమెను కలసి వినతిపత్రం అంజేశారు. అర్జీ ఇచ్చిన వారిలో సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, ఏఐటీయూసి నాయకులు ఏ యోగయ్య, రైతు సంఘం నాయకులు ఎస్ దస్తగిరి తదితరులు ఉన్నారు.

● పెద్దారవీడు : గత ప్రభుత్వహయాంలో మండలంలోని గొబ్బూరు, ఓబులక్కపల్లి, దేవరాజుగట్టులలో చేసిన భూసర్వేలో అనేక లోపాలున్నాయని, ఆయా గ్రామాలలో భూ సర్వే తిరిగి నిర్వహించాలని టీడీపీ మండల కన్వీనర్ మెట్టు శ్రీనివాసులరెడ్డి కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. అనంతరం మండలంలోని బద్వీడు చెంచుకాలనీ వద్ద ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో భాగంగా త్రవ్విన ఇంకుడు గుంతను గురువారం ఆమె పరిశీలించారు. పెద్దారవీడు నుంచి చెంచుకాలనీ వరకు 5 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మించాలని కోరారు. చెంచుకాలనీలో ఎస్టీలకు కేటాయించిన ఇంటిస్థలాలను పలువురు ఆక్రమించారన్నారు. కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్ర నిర్మించాలని కోరారు. ఆశ్రమ పాఠశాల ఏర్పాటుకు అవసరమైన 3 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు.

పెద్దదోర్నాల : రైతులకు న్యాయం జరిగేందుకే భూముల రీసర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. మండలంలోని చిన్నగుడిపాడు, చిన్నదోర్నాల గ్రామాలలో కలెక్టర్ అన్సారియా, మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకటత్రివినాగ్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా చిన్న గుడిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న భూరీసర్వే కలెక్టర్ అన్సారియా పరిశీలించారు .సంబంధిత రైతులతో మాట్లాడారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, తహసీల్దార్ కిన్నెరశాంతి, డిప్యూటీ తహసీల్దార్ సాలమ్మలను ఆదేశించారు. ఈ సందర్భంగా చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన పలువురు కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి నిర్మాణంలో తమ భూములు కోల్పోయామని నేటికీ అందుకు తగిన సొమ్ము ఇవ్వకుండా పనులు చేస్తున్నారన్నారు. కొందరు, తమ భూములకు తగిన ధరలు ఇవ్వలేదని మరికొందరు న్యాయం చేయాలని వినతిపత్రాలు అందజేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మండల పర్యటనలో భాగంగా కలెక్టర్ అన్సారియా చిన్నదోర్నాలలో ఉపాధిహామీ పనులను పరిశీలించేందుకు ఆ గ్రామం చేరుకోగా పెద్ద ఎత్తున ప్రజలు ఆమెను చుట్టుముట్టారు. తమకు నీటి సమస్య తీవ్రంగా ఉందని ఇబ్బందులు పడుతున్నామని పరిష్కరించాలని కోరారు. ఈ క్రమంలో ఎంపీడీవో నాసర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ భ్రమరాంబికాదేవి ఇప్పటికే గ్రామంలో 4 ఏజన్సీల ద్వారా 20 ట్రిప్పులు ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నామన్నారు. అవి ఏపాటికి సరిపోవడం లేదని బోరు వేసి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరారు. పరిశీలించి తగిన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకర్ రావు, ఏపీఎం వినయ్‌కుమార్, ఎంఈవో మస్తాన్ నాయక్, వీఆర్‌వోలు ఏడుకొండలు, సునీత, రెవెన్యూ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు


మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధితోపాటు ఆలయాల అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ సమీపంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన టీడీపీ విద్యుత్ ప్రభపై నాయకులతో కలిసి ఎరిక్షన్ బాబు మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ళు చేయలేని పనులు కూడా కూటమి ప్రభుత్వం వచ్చిన ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లోనే కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. కల్లులేని వైసీపీ నాయకులు అనవసర విమర్శలు చేస్తున్నారని అన్నారు. వచ్చే శివరాత్రికల్లా ఆలయాలను సుందరంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. మరో కోటప్ప కొండలా చేస్తామన్నారు. ఎన్నెస్పీ కాలువపై రెండో వంతెనకు త్వరలో మంత్రి బీసీ జనార్ధనరెడ్డితో శంఖుస్థాపన చేయిస్తామని తెలిపారు. పక్కనే ఉన్న చెర్లోపల్లిలో కోటి నలభై లక్షలతో రోడ్డు వేసినట్లు తెలిపారు. గ్రామాలలో సీసీ రోడ్లు వేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోటకట్ల శ్రీనివాసరెడ్డి, డి.చలమయ్య, ఆళ్ళ నాసరరెడ్డి, ఎం.వలరాజు, వి.ఆంజనేయులు, జి.వెంకటనారాయణ, కె.కొండలు, జి.సునీల్, చేకూరి సుబ్బయ్య, సత్యనారాయణ గౌడ్, వెంగళరెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైలం యాత్రికులకు అన్న సంతర్పణ


అన్నదానం చేస్తున్న గునుపూడి భాస్కర్

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం వెళ్లి వచ్చే భక్తులకు దోర్నాలలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని గురువారం కూడా కొనసాగించారు. చట్టుతాండా వద్ద పెద్ద బొమ్మలాపురం గ్రామ కమిటి ఆధ్వర్యంలో, నిదానంపాటి అమ్మవారి దేవాలయం ఎదురుగా అఖిల భారత రెడ్లసంఘం ఆధ్వర్యంలో, పెద్ద బ్రిడ్జి సమీపంలో ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో, అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో కాపు సంఘం ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమాలు

పొదిలి : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పట్ట ణంలో పలువురు అన్నదాన, తాగునీటి సరఫరా, శీతల పానియాలు, మజ్జిగ తదతర కార్యక్రమాలను స్వచ్ఛందంగా ఏర్పాటు చేశారు. అంజనేయ స్వామి గుడి వద్ద నుంచి చిన్నబస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపుల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి భక్తిని చాటుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి బాస్కర్, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, శివాలయం మాజీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, లారీ ఓనర్స్ అసోసియేషన్, బొమ్మరిల్లు బేకరి, ఆవోపా, ఎరువుల దుకాణదారుల ఆధ్వర్యంలో పలువురు భక్తులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పాడిరైతులకు కరువు దెబ్బ

● భారమవుతున్న పశుపోషణ
● తక్కువ ధరకు విక్రయం
● కబేళాకు తరలుతున్న పశువులు


బక్కచిక్కుతున్న పశువులు

కంభం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది సరైన వర్షాలు కురవక పోవడంతో పశుసంపదకు కరువుదెబ్బ తగిలింది. రోజురోజుకు పశువుల సంఖ్య తగ్గిపోతోంది. పంటలు పండకపోయినా, సాగులో నష్టాలు వచ్చినా రైతులు పశుపోషణపైనే ఆధార పడతారు. అయితే వర్షాభావ పరిస్థితులతో పశుపోషణ కూడా భారమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మూగ జీవాలను సంతలో అమ్మకానికి పెడుతున్నారు. పాలిచ్చే గేదెలకు మేత కరువై విక్రయానికి సిద్ధపడుతున్నారు. పాడి పశువులకు పచ్చిమేత, తాగునీరు సైతం దొరికే స్థితి లేదు. దీంతో పాలదిగుబడి గణనీయంగా తగ్గిపోతున్నది. గ్రామాల్లోని బోర్లలో వచ్చే అరకొర నీటితో పశువుల దాహం తీరడం లేదు. సకాలంలో మేత, నీరు లేకపోవడంతో అవి బక్కచిక్కిపోతున్నాయి. పశుదాణ కొనలేక పశువులను బేస్తవారపేట, మార్కాపురం మార్కెట్ యార్డులలో సంతలలో విక్రయిస్తున్నారు.. ఫిబ్రవరి నెలలోనే ఇలా ఉంటే రానున్న మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలకు గ్రాసం, నీరు దొరకక పశుసంపద కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గురుకులంలో సీట్ల కేటాయింపు కోసం దరఖాస్తులు

గిద్దలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాచర్లలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మేరీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో 80 సీట్లు, జూనియర్ ఇంటర్‌లో 80 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఐదవ తరగతిలో ప్రవేశానికి సంబంధించి ప్రవేశపరీక్ష ఏప్రిల్ 6న ఉదయం 10గంటలకు ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ వారికి అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఉంటుందని వివరించారు. వివరాలకు 8309540981 సంప్రదించాలన్నారు.

రసవత్తరంగా ఎడ్లపోటీలు


బండ లాగుతున్న ఎడ్లు

కొనకనమిట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబాపురం గ్రామంలో బాలత్రిపురసుందరిదేవి తిరునాళ్ల సందర్భంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు గురువారం గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల పలు గ్రామాల ప్రజలు తరలివచ్చారు. మొత్తం 5 జతల ఎడ్లు పోటీలలో పాల్గొన్నాయి. ఎల్‌కోటకు చెందిన ఉలవ హరిక్రిష్ణ ఎడ్లజత 2550 అడుగుల దూరంలాగి ప్రధమస్థానంలో నిలిచాయి. పొదిలి, కొనకనమిట్ల మండలం రాములవీడు, నాగరాజుకుంట గ్రామాలకు చెందిన ఎడ్లజత ద్వితీయ స్థానం, రాములవీడు, లక్కవరం గ్రామాలకు చెందిన ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచాయి మొదటి బహుమతి రూ30వేలు, రెండవబహుమతి రూ20వేలు, మూడవ బహుమతి రూ10వేలురూపాయలను గెలుపొందిన ఎడ్లజత పశుపోషకులకు అందజేశారు.

సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సైన్సు పట్ల ఆసక్తి పెంచుకొని నూతన ఆవిష్కరణలు చేయాలని కమలా విద్యాసంస్థల చైర్మన్ పి.పవన్‌కుమార్ అన్నారు. స్థానిక కమలా హైస్కూల్(సీబీఎస్‌ఈ)లో గురువారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు స్టెం ఎక్స్‌ప్లోరేషన్ అనే పేరుతో సైన్సు, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితంలలో ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. తోటి విద్యార్థులకు బోధించారు. అనుభవపూర్వకంగా అభ్యాసన ప్రక్రియ ద్వారా అనేక వైజ్ఞానిక సిద్ధాంతాలు నేర్చుకున్నారు. ప్రదర్శన ప్రారంభించిన పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చదువుతోపాటు అభివృద్ధి చెందుతున్న సైన్సు అండ్ టెక్నాలజీపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ పి.సింధూజ, ఉపాధ్యాయులు శ్రీకేశ్, సూర్యబాబు, లక్ష్మీకీర్తి, బీబీ జాన్, హరిత, ప్రిన్సిపాల్ స్వరూప్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్రిపురాంతకేశ్వర కల్యాణం

త్రిపురాంతకం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి త్రిపురాంతకేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వైభవంగా సాగిన కళ్యాణోత్సవాన్ని భక్తులు భక్త పారవశ్యంతో తిలకించారు. కళ్యాణోత్సవానికి ముందు అర్చకులు విశ్వన్నారాయణశాస్త్రి, పాలంక ప్రసాదశర్మ ఆధ్వర్యంలో లింగోద్భవ కాల పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా సత్రాలు, ఆలయాల ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణ కార్యక్రమంలో ఈవో డి.రజనీకుమారి, వేదపండితులు పాల్గొన్నారు. గురువారం స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయాలకు విచ్చేసిన భక్తులు అన్ని సామాజిక సత్రాలలో భోజన సౌకర్యాలు కల్పించారు.

మహాశివునికి నంది వాహన సేవ

మార్కాపురం వన్‌టౌన్ : మహాశివరాత్రి పురస్కరించుకుని స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్ తేజ శర్మలు జగదాంబ, మార్కండేశ్వర స్వాములకు అభిషేకాలు, అలంకరణ, అర్చన నిర్వహించారు. సాయంత్రం మహాశివునికి నందివాహనంపై మహేశ్వర అలంకారంలో నగరోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి కార్యక్రమాలు పర్యవేక్షించారు.



మార్కాపురంలో నందివాహనంపై మహాశివుడు, త్రిపురాంతకంలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు



సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు, ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

శివాలయాల్లో ముత్తుముల ప్రత్యేక పూజలు

కంభం : మహాశివరాత్రి పర్వదినాలలో భాగంగా అర్ధవీడు మండలంలోని కాకర్ల, యాచవరం గ్రామాల్లోని శివాలయాల్లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకర్ల గ్రామంలోని శ్రీగంగ పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయాల్లో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలలో కాకర్ల, యాచవరం గ్రామ నాయకులు, మండల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు

గిద్దలూరు : మహా శివరాత్రి వేడుకల్లో భా గంగా రాచర్ల మండలం శ్రీకనక సురభేశ్వరస్వామి కోన దేవస్థానంలోని ఆర్యవైశ్య సత్రం వద్ద శ్రీరమాసహిత సత్య నారాయణస్వామి వ్రతా లు అత్యంత వైభవంగా జరిగాయి. ఆర్యవైశ్య దంపతులు సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సత్రం అధ్యక్షులు పి.క్రిష్ణ, ఉపాధ్యక్షులు కె.పిచ్చయ్య, కోశాధికారి జి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కె.సుబ్రమణ్యం, వి.ప్రసాద్, చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముఖాముఖి

మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు

వెంకటేశ్వరరావు, ఏపీఎం, దొనకొండ



ప్రశ్న: మండలంలో ఎన్ని పొదుపు గ్రూపు సంఘాలు ఉన్నాయి, అన్నీసక్రమంగా పని చేస్తున్నాయా ?

జవాబు: మండలంలోని 18 గ్రామ పంచాయల పరిధిలో 1083 పొదుపు గ్రూపుల సంఘాలు ఉన్నాయి. వాటిల్లో 26 పొదుపు గ్రూపు సంఘాల సభ్యులు వలసలు వెళుతుండటంతో, అవి కొంతమేర సక్రమంగా పనిచేయటం లేదు.

ప్ర: మండలంలో పొదుపు గ్రూపులకు బ్యాంక్ లింకేజీ రుణాల లక్ష్యం ఎంత ?

జ: 870 గ్రూపులకు రూ.39 కోట్లు లక్ష్యం కాగా, ప్రస్తుతం 75శాతం రుణాలు మంజూరు చేశాం. మార్చి నెలాఖరు నాటికి లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

ప్ర: సబ్సిడీ రుణాలు అందిస్తున్నారా ?

జ: పీఎంఈజీపై, పీఎంఎఫ్ఎంఈ పథకాల కింద గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాం. త్వరలో అర్హులైన వారికి రుణాలు అందించేలా చర్యలు చేపడతాం.

ప్ర: ఉమెన్‌లీడ్ పథకం కింద ఎంత మందికి రుణాలు ఇచ్చారు?

జ: 250 మంది మహిళలకు రుణాలు ఇవ్వాలనేది లక్ష్యం కాగా ఇప్పటివరకు 130 మందికి రూ.లక్ష చొప్పున ఇచ్చాం. మిగిలిన దరఖాస్తులు ప్రతిపాదనలో ఉన్నాయి.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విధంగా రైతులు అవగాహన పెంచు కోవాలని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం మండలంలోని పెదఉల్లగల్లు, పులిపాడు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని సూచించారు. పసుపుగల్లు పీఏసీఎస్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు విచ్చలవిడిగా పురుగు మందులు, ఎరువులు వాడవద్దన్నారు. కార్యక్రమంలో వీఏఏ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

దొనకొండ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ డే సందర్భంగా దొనకొండలోని సెయింట్ ఆంథోనీస్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ అరుణపవిత్ర నేతృత్వంలో గురువారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు వివిధ అంశాలపై ప్రదర్శించిన ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ రెవరండ్ ఫాదర్ జి.థామస్, పొదిలి పట్టణానికి చెందిన నిర్మలా కాన్వెంట్ ప్రతినిధులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఫాదర్ థామస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలుగు తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడ తాయన్నారు. విద్యార్థుల్లో మేధాశక్తిని, ఆలోచనలను పెంచేందుకు ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషిచేయాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషిచేయాలని వెలుగు ఏపీఎం టి.హనుమంతరావు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రుణాలు తీసుకున్న లబ్ధిదారులు తిరిగి సకాలంలో చెల్లించే విధంగా గ్రామ సంఘం అధ్యక్షులు పని చేయాలన్నారు. స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజీ లాంటి రుణాలు వసూలు చేయాల్సిన బాధ్యత సిబ్బంది, అధ్యక్షులపై ఉందన్నారు. గతంలో ఆగిపోయిన పొదుపు సంఘాలను పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్ వసుంధరాదేవి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

» టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా
» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కనిగిరి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం టీడీపీ సభ్యత్వ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం వారి కుటుంబానికి ఎంతో భరోసాగా నిలుస్తుందన్నారు. సభ్యత్వ కార్డులో క్యూఆర్ కోడ్ ఆధారంగా వారికి పార్టీ నుంచి సేవలు అందే అవకాశం ఉందన్నారు. పార్టీ చేపట్టబోయే వివిధ పదవుల కల్పనలో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. పార్టీ కార్యకలాపాల్లోనూ ప్రముఖ పాత్ర ఉండబోతుంద న్నారు. నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధిలో టీడీపీ శ్రేణులంతా ఒక్కటై ముందుకు సాగాలన్నారు. పార్టీని మరింత బలోపేతంగా మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ బలాబలాలను సభ్యత్వ నమోదుతో రుజువైందని చెప్పారు. సభ్యత్వ నమోదులో కనిగిరి ప్రాంతం ప్రాధాన్యంగా నిలవటం పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు చేసిన నిర్విరామ కృషి ఇందుకు నిదర్శనమన్నారు. సభ్యత్వం చేసుకున్న ప్రతి కార్యకర్తకు వారి ఇంటికెళ్లి కార్డు అందజేసేవిధంగా ఆయా మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, బూత్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు బాధ్యత తీసుకోవాలన్నారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటూ కనిగిరి అభివృద్ధిలో ప్రతిఒక్కరం భాగస్వాములవుదామని చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ కనిగిరి క్లస్టర్ ఇన్‌చార్జ్ దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లు, కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, బొమ్మనబోయిన వెంగయ్య, వేమూరి రామయ్య, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, అడుసుమల్ల ప్రభాకర్, గుడిపాటి ఖాదర్, జంషీర్ అహ్మద్, బుల్లా బాలబాబు, తాతపూడి స్టాలిన్ (బుజ్జి), నజిముద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు షరీఫ్, చింతలపూడి తిరుపాలు, చిలకపాటి లక్ష్మయ్య, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో జోరుగా గంజాయి విక్రయాలు!

» పెడదోవ పడుతున్న యువత
» ప్రజలను భయకంపితులను చేస్తున్నవైనం

కనిగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో జోరుగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. పట్టణ శివారు కాలనీలతోపాటు ఒంగోలు బస్టాండు ప్రాంతంలో కొంతమంది యువత చిన్నచిన్న పొట్లాలుగా చేసి బైక్‌లపై చక్కర్లు కొడుతూ అమ్మకాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. పట్టణంలోని కొండ దిగువన, దొరువు వద్ద, నాగులచెరువు, గార్లపేట రోడ్డులోని గ్రానైట్ క్వారీల సమీపంలో, పొదిలి రోడ్డులోని కాశిరెడ్డికాలనీ, పాపిరెడ్డికాలని, నందనమారెళ్ళ మూలమలుపు వద్ద గంజాయి రవాణా చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. కంభం రోడ్డులోని అడ్డరోడ్డు కూడలి వద్ద రాత్రి వేళల్లో, మధ్యాహ్నా వేళలో అమ్మకాలు జరుగుతున్నట్లు నగరంలో చర్చ జరుగుతుంది. ఒంగోలు బస్టాండు వద్ద కొంతమంది యువత గంజాయి సేవించి బైకులపై రయ్..రయ్ మంటూ తిరుగుతూ తోటి వాహనదారులను, పాదచారులకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రాత్రి సమయాల్లో సాయిబాబా థియేటర్ వద్ద కొంతమంది యువత బైకులపై పెద్దపెద్ద శబ్ధాలు చేస్తూ స్థానిక ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు.

గార్లపేట రోడ్డులోని కొండ కింద కాలనీలో, దొరువు వద్ద కొంతమంది యువత గంజాయి స్థావరంగా ఏర్పరుచుకుని రవాణా చేస్తున్నారని ప్రచారం సాగుతుంది. అలాగే, గార్లపేట రోడ్డు నుంచి కందుకూరు రోడ్డులోకి వెళ్ళే మార్గంలో చెట్లమాటున గంజాయి విక్రయాలు సాగిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలీసులు ఆదిశగా నిఘా పెంచి గంజాయి విక్రయాలు, రవాణాను అరికట్టి యువతను పెడద్రోవ పట్టకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పంటల సాగులో ఆధునిక పద్ధతులు

» ఆదిశగా రైతులను చైతన్యం చేయాలి
» వ్యవసాయాధికారులకు డీఏవో శ్రీనివాసరావు సూచన



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

దర్శి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులకు ఆధునిక, సాంకేతిక పద్ధతులను వివరించి చైతన్యవంతులను చేయాలని జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) ఎస్.శ్రీనివాసరావు సూచించారు. గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో జిల్లాలోని వ్యవసాయాధికారులకు శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ వరి పంట కోసిన తర్వాత నీటి వసతి కల్గిన మాగాణి భూముల్లో అపరాలు, చిరుధాన్యాల పైర్లు సాగుచేసుకోవాలని సూచించారు. ఈవిధానాలను వ్యవసాయాధికారులు రైతులకు సూచించి ఆ పంటలను సాగుచేసే విధంగా చైతన్యవంతులను చేయాలని కోరారు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధానాధికారి డాక్టర్ పి.సంధ్య మాట్లాడుతూ నువ్వుల పంటలో చీడల ఉధృతిని గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యాన పరిశోధన స్థానం ప్రధానాధికారి డాక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ మిరప, మామిడి తోటల్లో తెగుళ్ళ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వ్యవసాయ పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రాల్లో సాగుచేసిన పంటలను, నూతన వంగడాలను సందర్శించారు. కార్యక్రమంలో సస్యరక్షణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాదరావు, జిల్లా వనరుల కేంద్రం అదనపు వ్యవసాయ సంచాలకులు పి.రామ్మోహన్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, దర్శి, గిద్దలూరు, మార్కాపురం, సింగరాయకొండ, ఒంగోలు, సబ్‌డివిజన్ల పరిధిలోని వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణం

» ప్రైవేట్ వాహనాల్లో తరలింపు
» కూలీల ప్రాణాలతో చెలగాటం
» పోలీసులు హెచ్చరికలు బేఖాతర్


తూర్పుగంగవరం వద్ద మినీ వ్యాన్‌లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న కూలీలు

తాళ్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణిస్తూ ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. పనులకు కూలీలను మినీ వ్యాన్‌ల్లో తరలిస్తున్నారు. ఈక్రమంలో ఆవాహనాల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. పోలీసుల హెచ్చరికలను బేఖాతర్ చేస్తున్నారు. తాళ్లూరు మండలంలోని గ్రామాల నుంచి నిత్యం అద్దంకి, ముండ్లమూరు, దర్శి ప్రాంతాలకు మిరప, వరి, పొగాకు కోతలకు కూలీలు వెళుతుంటారు. వాహనాల్లో కిక్కిరిసి వెళుతున్నారు. పోలీసులు పలుమార్లు పరిమితిని మించి రాకపోకలు సాగిస్తున్న ఆటోలను ఆపి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. తాము కూలీ చేసుకుని జీవనం సాగిస్తున్నామని, పనులకు తీసుకెళ్లే పొలం యజమానులు ఒక ట్రిప్పు మాత్రమే వేస్తున్నారని తెలిపారు. దీంతో తామంతా ఆటోల్లో కిక్కిరిసి వెళ్లాల్సి వస్తుందని, కూలీలు ప్రాధేయపడుతుండటంతో పోలీసులు కేసులు నమోదు చేయకుండా వదిలివేయాల్సి వస్తుంది. పనులకు వెళ్లే కూలీలను రెండు ట్రిప్పుల్లో పంపితే తమకు ఇబ్బందులు ఉండవని కొంద రు ఆటో డ్రైవర్లు అంటున్నారు.

ఇదిలాఉండగా కొందరు ఆటోడ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆటోలకు సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు కూడా లేకపోవటంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబాలకు బీమా కూడా అందే అవకాశం ఉండదు. కొందరు డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మరికొంతమంది చిన్న వయస్సులోనే వాహనాలను మితిమీరిన వేగంతో నడుపుతూ నియంత్రించలేక ప్రమాదాలకు కారణమవుతున్నారు. అధికారులు అనేకమార్లు పరిణితి మించి కూలీలను తీసుకెళుతున్న ఆటోడ్రైవర్లకు జరిమానాలు విధించినా మార్పురావటం లేదు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకొని ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

కన్నుల పండువగా స్వామివార్ల కల్యాణం


స్వామివారికి గండ దీపాలను సమర్పిస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి శ్రీదేవి భూదేవిసమేత శ్రీవిష్ణుమూర్తి స్వామివార్ల కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

అనంతరం మహిళా భక్తులు గండ దీపోత్సవాలు వెలిగించి స్వామి వారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కొమ్మినేని చిన్నఆదినారాయణ, ఈవో శ్రీగిరిబాబు నరసింహాబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

కురిచేడు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరణ చేసేందుకు కేంద్రప్రభుత్వం ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు కార్డు అందిస్తుందని మండల వ్యవసాయాధికారి మధుబాబు తెలిపారు. గురువారం మండలంలోని కురిచేడు, బోధనంపాడు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా విశిష్ట గుర్తింపు సంఖ్య కార్డుపై రైతులకు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలు, రాయితీలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో పొలం ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావటం ఈకార్యక్రమం ముఖ్యఉద్దేశమన్నారు. ఇప్పటివరకు మండలంలో 3683 రైతులు మాత్రమే నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన రైతులు త్వరతిగతిన నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటితో ప్రజల అవస్థలు


పసుపుగల్లులోని కొత్తూరు వీధిలో ముందుకు కదలని మురుగు

ముండ్లమూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు గ్రామ పంచాయతీలోని పలు వీధులు మురుగు నీటితో దుర్గంధం వెదజల్లుతున్నాయి. కొన్నిచోట్ల కాలువలు పూడుకుపోయి రోడ్లపైకి మురుగునీరు చేరుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన పంచాయతీ అధికారులు ఆ వైపు కూడా కన్నెత్తి చూడటంలేదు. కొత్తూరు నుంచి చింతలపూడి వెళ్ళే ప్రధాన రహదారిలో మురుగు కాలువ పూడుకుపోవటంతో ఇళ్ళలోని నీరంతా రోడ్ల పైకి చేరుతుంది. మురుగులో దోమలు విపరీతంగా పెరిగి పోవటంతో ఎటువంటి రోగాలు వ్యాపిస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి పలువీధుల్లో నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూడుకుపోయిన కాలువల్లో చెత్తాచెదారం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

భైరవకోన హుండీ ఆదాయం రూ.2 లక్షల 95 వేలు

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని భైరవేశ్వరస్వామి దేవస్థానంలో ఈవో వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. జనవరి 8 నుంచి ఫిబ్రవరి 27 వరకు భక్తులు సమర్పించిన కానుకల హుండీని లెక్కించగా రూ.2,95,361 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ముప్పళ్ల శ్యాంసుందర్‌రాజు, ఎం.పవన్‌కుమార్‌రాజు, ఎంఆర్ శ్రీనివాసులు, అర్చక బృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో బి.సంపత్‌కుమార్ రైతులకు సూచించారు. గురువారం సీఎస్‌పురం మండలంలోని కంభంపాడు, పెదరాజుపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా శనగ, జొన్న పైర్లను పరిశీలించి రైతులుకు పలుసూచనలు చేశారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా భూఆధార్ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు ఎం.రవి, రాజశేఖర్, ఐ.అఖిల్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు కందులను అమ్ముకోవాలి

కనిగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కందులను అమ్ముకోవాలని ఏఏవో జ్యోష్ణాదేవి రైతులకు సూచించారు. ఇందుకోసం రైతు సేవాకేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. గురువారం మండలంలోని గుడిపాడులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా కంది అమ్మకాలపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు. రైతుకు 11 అంకెల నంబర్ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ విశిష్ట సంఖ్య నమోదుకు ఈనెల 28వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. పీఎం కిసాన్ నగదు జమ అయిన ప్రతి రైతు రిజిస్ట్రీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సుబ్బారావు, ఎం.యోగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం ఆధునికీకరణకు విరాళం


సీఎస్‌పురం (పామూరు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఫ్లోరైడ్ బాధితుల సహాయార్థం కనిగిరిలోని డయాలసిస్ సెంటర్ ఆధునీకరణకు సీఎస్‌పురం మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు షేక్ నాయబ్‌రసూల్ (బడే) రూ.50 వేల విరాళం ప్రకటించారు. గురువారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లోగల ఉగ్ర క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి విరాళం అందజేశారు. ఈసందర్భంగా దాతను ఉగ్ర అభినందించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధికార ఒంగోలు పార్లమెంట్ ప్రతినిధి షేక్ రజ్జబ్‌బాషా, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పీవీ కృష్ణమోహన్, షేక్ ఖలీల్, నాయబ్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం


విద్యుత్ దీపాల కాంతుల్లో దర్గా ప్రాంగణం

కనిగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలోని ఒంగోలు బస్టాండు వద్ద ఉన్న శ్రీహజరత్ బాదేషా పాఛ్ఛా హుస్సేని చిష్టువుల్ ఖాదరీ 106వ గంధ మహోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ గఫార్ కుటుంబసభ్యులతో కలసి బాబాకు గంధాన్ని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అన్నివర్గాల వారు అన్నదమ్ముల్లా కలసి ఉత్సవాలను జరుపు కోవాలన్నారు. బాబాను పలువురు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. డీఎస్పీ ఆదేశాలతో సీఐ ఖాజావలి గంధమహోత్సవం వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు.


బాబాకు గంధం సమర్పించి ప్రార్థనలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్ దంపతులు



అమరావతి అశేష జనవాహిని మధ్య స్వామి వార్ల రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

కన్నుల పండువగా కల్యాణోత్సవం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి అమరేశ్వరుని లింగోద్భవ అభిషేకాల అనంతరం బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి కల్యాణోత్సవం జరిగింది. ఆలయంలోని స్వామి కల్యాణ మండపంలో కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్ దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించగా ఆలయ ప్రధానాచార్యులు, వేదపండితులు, అర్చకులు కల్యాణాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు జాగారం చేసి కల్యాణోత్సవాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామివార్ల తలంబ్రాలను, ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం గురువారం ఉదయం నూతన దంపతులైన ఉత్సవమూర్తులు హంస, నంది, మిద్దె రథంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. దారి పొడవున భక్తులు స్వామి వార్లకు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి కీలుగుర్రంపై గ్రామోత్సవంలో విహరించారు.

కమనీయం రథోత్సవం

- భక్తిశ్రద్ధల మధ్య అమరేశ్వరుని రథోత్సవం
- భక్తులతో కిటకిటలాడిన అమరావతి వీధులు
- జాగారం చేసి కల్యాణాన్ని తిలకించిన భక్తులు
- హంస, నంది, మిద్దె రథంపై కల్యాణమూర్తుల గ్రామోత్సవం

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జై.. సాంబశివ. శంభో.. శంకర.. శివశంకర.. నామస్మరణలతో అమరావతి వీధులు మారుమోగాయి. భక్తుల జయజయధ్వానాలు.. మంగళవాయిద్యాలు.. డ్రోన్లతో ఆకాశం నుంచి పూల వర్షం కురుస్తుండగా.. వేదమంత్రోశ్చరణల మధ్య గురువారం సాయంత్రం అమరేశ్వరుని రథోత్సవం అమరావతి పురవీధుల్లో అంగరంగ వైభవంగా జరిగింది. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అమరావతిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో గురువారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా వేలాది మంది భక్తుల సమక్షంలో బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం జరిగింది. అనంతరం గురువారం సాయంత్రం దేవతామూర్తుల రథోత్సవం భక్తుల శివనామ స్మరణలతో అంబరాన్ని తాకింది. ముందుగా స్వామివార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి రథశాలకు తీసువచ్చి పూలతో అలంకరించిన రథంపై ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, హరిబాబు, ఈవో సునీల్‌కుమార్ టెంకాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో అమరావతి పురవీధులు కిటకిటలాడాయి. డీఎస్పీలు హనుమంతరావు, వెంకటరమణల పర్యవేక్షణలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నాలుగు డ్రోన్ కెమేరాలతో రథోత్సవాన్ని పోలీసులు పర్యవేక్షించారు. కళాకారుల ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు భక్తులను అలరించాయి.



రథోత్సవం ముందు వివిధ వేషధారణల్లో కళాకారులు



బూత్‌లో ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి



వేమూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ



గుంటూరులో ఓటు వేస్తున్న అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, లక్ష్మణరావు

పట్టభద్రులు.. ఓటెత్తారు

- 69.57 శాతం పోలింగ్ నమోదు
- గతంలో కంటే 10 శాతంపైగా పెరుగుదల
- తమకే అనుకూలమంటున్న కూటమి నేతలు
- అవన్నీ రిగ్గింగ్ చేసినవేనని పీడీఎఫ్ వర్గాల ఆరోపణ

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులైన దివ్యాంగులు.. గర్భిణులు.. ఉద్యోగులు.. మహిళలు.. ఓటు వేసేందుకు పోటెత్తారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల చైతన్యం వెల్లివెరిసింది. స్వల్ప తోపులాటలు మినహా ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. విద్యావంతులు అధిక సంఖ్యలో ఉండే గుంటూరు, విజయవాడ లాంటి నగరాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఓటుహక్కుని వినియోగించుకున్నారు. గంటగంటకు పోలింగ్ పెరుగుతూ వచ్చింది. ఉదయం 10 గంటలకు 11.08 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 29.97 శాతం, 2 గంటలకు 49.06 శాతం, సాయంత్రం 4 గంటలకు 65.58, సమయం ముగిసినప్పటికీ అప్పటికే క్యూలో ఉన్న ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుని పోలింగ్ ముగిసేసరికి 69.57 శాతానికి చేరుకున్నది. గురువారం ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ జరిగింది. ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ని ఎన్నికల సంఘం ప్రకటించడం, ప్రైవేటు కంపెనీల్లో పని చేసే ఉద్యోగులు ఓటు వేసి ఆలస్యంగా వచ్చినా అనుమతించాలని ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశాలు జారీ.. విద్యా సంస్థలకు సెలవు తదితరాలతో ఓటు వేసేందుకు పట్టభద్రులు పోలింగ్ బూత్‌లకు బారులు తీరారు. ఉదయం 7.30 గంటలకే బూత్‌ల వద్దకు చేరుకుని క్యూలో నిలుచుని ఓటింగ్‌లో పాల్గొన్నారు. దివ్యాంగులైన పట్టభద్రులు వయస్సుతో సంబంధం లేకుండా పోలింగ్ బూత్‌లకు రావడం విశేషం. మరోవైపు గర్భిణులు, బాలింతలు కూడా వచ్చి ఓటు వేశారు. ఈ కారణంగానే గతంలో కంటే దాదాపుగా 10 శాతం పైగా పోలింగ్ పెరిగింది. 2019లో ఎన్నికలు జరిగినప్పుడు 59.39 శాతం పోలింగ్ నమోదైంది. ఈ దఫా 69.57 శాతానికి పెరిగింది. పల్నాడు జిల్లాలో అత్యధికంగా దాదాపుగా 77.33 శాతం ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. గురవారం ఉదయం పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటలు మందకొడిగా సాగిన ఓటింగ్ ఆ తర్వాత ఊపందుకుంది. మధ్యాహ్నానికి ఓటర్లు పోలింగ్ స్టేషన్ల ముందు బారులు తీరారు. సాయంత్రం 4 గంటలకు గడువు ముగిసే సమయానికి కూడా ఓటర్లు క్యూల్లో ఉండడం గమనార్హం. ఆరు జిల్లాల పరిధిలో 483 పోలింగ్ బూత్‌లలో 2,41,502 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. దాదాపు లక్షా 5 వేల 634 మంది పోలింగ్ బూత్ ముఖమే చూడలేదు. గుంటూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి పోలింగ్ ప్రక్రియను అధికారులతో కలిసి రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి ప్రత్యేకంగా పరిశీలించారు.

జిల్లాల వారీగా పోలింగ్ శాతం ఇలా...

జిల్లా పేరు	ఓటర్లు	ఓటేసిన వారు	శాతం
ఏలూరు	16099	11801	73.30
కృష్ణా	63114	44125	69.91
ఎన్‌టీఆర్	78063	51279	65.59
గుంటూరు	108109	71836	66.45
బాపట్ల	24493	18198	74.30
పల్నాడు	57238	44263	77.33
మొత్తం	347116	241502	69.57

* మొత్తం ఓటర్లు 3,47,116 మంది కాగా 2,06,456 మంది పురుషులు, 1,40,615 మంది మహిళలు, 45 మంది ట్రాన్స్‌జెండర్లున్నారు. వీరిలో పురుషులు 1,48,506 మంది, మహిళలు 92,994, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు పోలింగ్‌లో పాల్గొన్నారు. ఓటు హక్కు కలిగిన పురుషుల్లో 71.93 శాతం, మహిళల్లో 66.13 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

* కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సిట్టింగ్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణ రావ గుంటూరులో ఓటుహక్కు వినియో గించుకున్నారు.

గుంటూరులోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మద్దతుదారులు ఓటరు స్లిప్పులపై లక్ష్మణరావు ఫొటో ముద్రించి పంపిణీ చేస్తున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు లు వెళ్లాయి.



బూత్ వద్ద ఓటర్లతో సదుపాయాలపై అడిగి తెలుసుకుంటున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

* బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న పోలింగ్ సరళిని కూటమి పార్టీలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి పరిశీలించారు.

* బాపట్ల జిల్లాలో 74.31 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లా పరిధిలోని రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల పరిధిలోని 34 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరిగింది. 24,493 మంది ఓటర్లకు 18,200 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

* బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వద్ద గడువు ముగిసిన తర్వాత ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే విషయంలో టీడీపీ, పీడీఎఫ్ వర్గాల మధ్య తోపులాట జరిగింది. పట్టణ టీడీపీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, పీడీఎఫ్ మద్దతుదారుడు అనిల్‌పై దాడి చేశారు. ఈ నేపథ్యంలో కొద్ది సేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

స్ట్రాంగ్‌రూంకు తరలిన బ్యాలెట్ బాక్సులు

పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో సిబ్బంది బ్యాలెట్ బాక్సులకు ఏజంట్ల సమక్షంలో సీళ్ల వేశారు. అనంతరం వాటిని తీసుకుని రూట్ల వారీగా తమకు కేటాయించిన వాహనాల్లో ఏసీ కళాశాలలోని రిసెప్షన్ సెంటర్‌కు తరలివచ్చారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్లలో స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ ఫారంలు, పీవో డైరీ వంటివి క్షుణ్ణంగా పరిశీలించి బ్యాలెట్ బాక్సులను స్వీకరించి స్ట్రాంగ్‌రూంకు తరలించారు. పల్నాడు, బాపట్ల, ఎన్‌టీఆర్, ఏలూరు, కృష్ణ జిల్లాల్లో స్థానికంగానే తాత్కాలిక స్ట్రాంగ్‌రూంలు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా జిల్లాల బ్యాలెట్ బాక్సులను అక్కడ స్వీకరించి వాటన్నింటిని కలిపి గుంటూరు ఏసీ కళాశాలకు తరలించడం ప్రారంభించారు. అన్ని జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులు వచ్చిన తర్వాత ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన నాలుగు స్ట్రాంగ్ రూంలకు చేర్చి సీలు వేస్తామని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి తెలిపారు.

గెలుపుపై ధీమా..

పోలింగ్ శాతం గణనీయంగా పెరగడం అటు రాజకీయ, ఇటు అధికారవర్గాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. పోలింగ్ శాతం గతంలో ఎన్నడూ లేని విధంగా పెరగడంతో ఎన్‌డీఏ కూటమి నేతలు తమకే అనుకూలమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా ఓటింగ్ తమకు అనుకూలంగా జరిగిందని, ఖచ్చితంగా పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపు తథ్యంగా ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. తాము పక్కా ప్రణాళికతో పట్టభద్రులను ఓటర్లుగా నమోదయ్యేందుకు శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించి దరఖాస్తులు చేయించామని దీంతో ఓటర్ల సంఖ్య పెరిగిందని ఆలపాటి వర్గీయులు చెప్తున్నారు. తమ ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలన్న ఆకాంక్ష పట్టభద్రుల్లో కనిపించిందంటున్నారు. పెరిగిన పోలింగ్ శాతం ఖచ్చితంగా తమ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే విజేతగా నిలబెడుతుందని చెబుతున్నారు. కాగా ఓటింగ్ శాతం గత మూడు పర్యాయాలు చూసుకుంటే 60 శాతం లోపే ఉండేదని, ఇప్పుడు అదనంగా 10 శాతం పైగా పెరగడానికి కారణం దొంగ ఓట్లు, రిగ్గింగ్, ఏజంట్లను పోలింగ్ బూత్‌ల నుంచి తరిమేయడమేనని పీడీఎఫ్ వర్గీయులు ఆరోపిస్తున్నారు. పల్నాడు జిల్లాలో తమ ఏజంట్లను బూత్‌లలోకి రానీయకుండా ఓట్లు వేసుకున్నారని ఆరోపిస్తున్నారు.



మొదటి బహుమతిని అందుకుంటున్న కొక్కిలిగడ్డ టీం



రెండవ బహుమతిని అందుకుంటున్న టీం

సత్తాచాటిన కృష్ణాజిల్లా ఎడ్లు

- హోరాహోరీగా పోలు రాదా ఎడ్ల పందేలు

చీరాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చీరాల మండలం బోయినవారిపాలెంలో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి న్యూ జూనియర్స్ పోలురాదా ఎడ్ల పందేలు ముగిశాయి. అర్ధరాత్రి వరకు జరిగిన ఉత్కంఠ పోరులో కృష్ణా జిల్లా ఎడ్లు సత్తాచాటి మొదటి, రెండో బహుమతులను సొంతం చేసుకున్నాయి. కృష్ణా, గుంటూరు, నెల్లూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి 16 జతల ఎడ్లు పోటీలో పాల్గొన్నాయి. ప్రకాశం జిల్లా కందుకూరు 3, బాపట్ల జిల్లా చెరుకుపల్లి 4, బాపట్ల 5, కృష్ణా జిల్లా కలవరపాడుకు చెందిన ఎడ్ల జత 6వ స్థానం దక్కించుకున్నాయి. నిర్వాహకులు విజేతలకు బహుమతులను అందజేశారు.

నిధులకు వీడిన గ్రహణం

- నాలుగు పంచాయతీలకు సీనరేజీ నిధులు
- ఈ ఏడాది రూ.33 లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు
- మంత్రి రవికుమార్ ఆదేశాలతో వివాదానికి చెక్

బల్లికురవ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గత రెండేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి వచ్చే సీనరేజీ నిధుల వాటాలలో నాలుగు పంచాయతీల మధ్య నెలకొన్న వివాదాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు అందరికీ ఆమోదయోగ్యంగా మరోసారి వాటాలను కేటాయించి వివాదానికి చెక్ పెట్టారు. వీర్లకొండ గ్రానైట్ క్వారీల నుంచి వచ్చే సీనరేజ్ నిధుల కేటాయింపులు జరిగే నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం, కొణిదెన, కె.రాజుపాలెం గ్రామాల మధ్య రెండేళ్ల నుంచి వివాదం కొనసాగుతుంది. 2008లో అప్పటి అధికారుల సమక్షంలో గతంలో పనిచేసిన సర్పంచ్‌లు అన్ని గ్రామాలకు సీనరేజీ నిధులను కేటాయించారు. అందులో బాగంగా గతంలో కె.రాజుపాలేనికి 17 శాతం, కొణిదెనకు 24 శాతం, నక్కబొక్కలపాడుకు 27 శాతం, మల్లాయపాలేనికి 32 శాతం చొప్పున నిధులను కేటాయించేలా ఒప్పందం జరిగింది. అప్పటి నుంచి అన్ని పంచాయతీలకు వాటాల మేర సీనరేజీ నిధులను కేటాయిస్తూ వచ్చారు. గత వైసీపీ పాలనలో అప్పటి అధికారులు కొందరు సీనరేజీ నిధులను అన్ని పంచాయతీలకు కేటాయించకుండా ఒక్క కొణిదెన పంచాయతీకే రూ.1.45 కోట్లను జమ చేశారు. దీంతో మిగిలిన గ్రామాల సర్పంచ్‌లు తమకు జరిగిన అన్యాయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ నిధులు వినియోగించకుండా హోల్డ్‌లో పెట్టించారు. దీంతో అటు కొణిదెన, ఇటు మిగిలిన మూడు గ్రామాల సర్పంచ్‌లు నిధుల కేటాయింపుపై కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో రెండేళ్ల నుంచి నిధులు ఉండి కూడా వివాదంతో నాలుగు గ్రామాలలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

కూటమి ప్రభుత్వం దృష్టి

గత వైసీపీ పాలనలో జరిగిన తప్పుతో గ్రామ పంచాయతీల్లో నిధులు ఉండి అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని నక్కబొక్కలపాడు, రాజుపాలెం, మల్లాయపాలెం గ్రామాల సర్పంచ్‌లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో మంత్రి వెంటనే కలెక్టర్ వెంకటమురళికి సీనరేజీ నిధుల సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రంగంలోకి దిగిన అధికారులు రెవెన్యూ, మైనింగ్, జిల్లా పంచాయతీ అధికారులు త్రీ మన్ కమిటీగా ఏర్పడి గత నెలలో క్వారీ భూములను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందించారు. ఆ నివేదికల ఆధారంగా మరో మారు పంచాయతీలకు వాటాల మేర నిధులు కేటాయిస్తూ కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో ప్రభాకరరావు ఉత్తర్వులు ఇచ్చారు.

కేటాయింపులు ఇలా..

త్రీమన్ కమిటీ ద్వారా అధికారులు జరిపిన పరిశీలన మేరకు కొణిదెన పంచాయతీకి 30 శాతం, మల్లాయపాలేనికి 30 శాతం, నక్కబొక్కలపాడుకు 25 శాతం, కె.రాజుపాలేనికి 15 శాతం చొప్పున ఈ ఏడాది నుంచి గ్రానైట్ క్వారీల ద్వారా వచ్చే సీనరేజ్ నిధులు కేటాయింపులు చేస్తామని అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో కోర్టులో వివాదంగా ఉన్న రూ.1.45 కోట్ల నిధుల విషయం కోర్టులో పంచాయతీలు కేసులను ఉపసంహరించుకుంటే అందరికీ వాటాల మేరకు పెండింగ్ నిధులు కూడా జమ చేస్తామన్నారు. వివాదం సమిసి సీనరేజీ నిధుల కేటాయింపులు జరగడంతో గ్రామాలలో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. 2025 సంవత్సరానికి వాటాల ప్రకారం సీనరేజీ నిధులు కొణిదెనకు రూ.9.91 లక్షలు, మల్లాయపాలేనికి రూ.9.91లక్షలు, నక్కబొక్కలపాడుకు రూ.8. 25లక్షలు, కె.రాజుపాలేనికి రూ.4.95 లక్షలు జమ కానున్నాయి.

ప్రభలోత్సవం

- అంగరంగ వైభవంగా కోటయ్య తిరునాళ్ల
- విజయవంతంగా ముగిసిన త్రికోటేశ్వరుని ఉత్సవాలు

కోటప్పకొండ(నరసరావుపేట) ఫిబ్రవరి 27: కోటయ్య క్షేత్రం ప్రభలతో కనువిందు చేసింది. కోటప్పకొండపై కోటయ్య తిరునాళ్ల ఉత్సవాలు బుధవారం సాయంత్రం నుంచి గురువారం తెల్లవారుజాము వరకు నేత్రపర్వంగా సాగాయి. రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులతో ప్రభలు కనువిందు చేశాయి. అర్ధరాత్రి జాగరణకు తరలివచ్చిన కోటయ్య భక్తులు ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి తరించారు. లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చి త్రికోటేశ్వరుని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



తిరునాళ్ళలో కాంతులీనుతున్న ప్రభలు

త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల అంగరంగ వైభవంగా ముగిశాయి. బుధవారం సాయంత్రం నుంచి భక్తులు పోటెత్తడంతో త్రికూటాద్రి కిటకిటలాడింది. తిరునాళ్లలో 20 భారీ విద్యుత్ ప్రభలు భక్తులకు కనువిందు చేశాయి. ప్రభలపై నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. సాధారణ ప్రభలు అధిక సంఖ్యలో కొం డకు తరలివచ్చాయి. కోటయ్యస్వామి ఆశీస్సులతో తిరునాళ్ల ఉత్స వం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. నాదెండ్ల మండలం అప్పాపురం,అవిశాయపాలెం, చిలకలూరిపేట మండలం పురుషోత్తంపట్నం, కావూరు, కోమటినేనివారిపాలెం, కమ్మవారిపా లెం, యడవల్లి, మద్దిరాల, గోవిందాపురం, బొప్పూడి, నరసరావు పేట మండలం కాకాని, ఉప్పలపాడు, చింతలపాలెం, గురవాయ పాలెం గ్రామాల నుంచి తరలివచ్చిన భారీ విద్యుత్ ప్రభలు కొండ వద్ద కొలువు దీరాయి.

ప్రక్షాళన దిశగా కుందేరు వాగు

- కలెక్టర్ సమీక్షతో అధికారుల్లో కదలిక
- ఆక్రమణదారుల్లో మొదలైన దడ


చీరాలలోని కుందేరు వాగు

చీరాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కుందేరు వాగు బాపట్ల జిల్లాలో బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లో ప్రవహిస్తోంది. చీరాల పరిధిలోని కుందేరు ఆక్రమణలకు గురై నేడు బక్కచిక్కి ఉంది. అయితే గత రెండు రోజుల కిందట అధికారులతో కలెక్టర్ వెంకటమురళి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆక్రమణలను తొలగించాలని కచ్చితమైన ఆదేశాలు కూడా జారీ చేశారు. ఆదిశగా కుందేరు ప్రక్షాళన చర్యలు మొదలైతే తమ పరిస్థితి ఏంటని ఆక్రమణదారుల్లో దడ మొదలైంది.


కుందేరుపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటమురళి(ఫైల్)

కుందేరు భౌగోళిక చరిత్ర

బ్రిటీష్‌వారి సమయంలో ప్రజలు, రైతులకు తుఫాన్, వరదలను ఎలాంటి ముప్పు లేకుండా ఉండేందుకు కేందేరును తవ్వారు. దానిపై కన్నేసిన ఆక్రమణదారులు పెద్దఎత్తున రెండువైపులా ఆక్రమించి ని ర్మాణాలు చేపట్టారు. దీంతో ప్రజలకు రక్షణ కవచంలా ఉండాల్సిన కుందేరు కబ్జాకోరల్లో చిక్కుకుపోయింది. తాజాగా అధికారుల నిర్ణయాలతో ప్రజలకు మేలు చేకూరే అవకాశం కనపడుతుంది. అధికారుల మాటలు నీటిమూటలైతే భవిష్యత్‌లో ముంపు బాధలు పునరావృతం అయ్యే అవకాశం లేకపోలేదు.

జిల్లాలో కుందేరు వాగు ప్రభుత్వ రికార్డుల ప్రకారం బాపట్ల మండలం పేరలి మొదలుకుని బాపట్ల, వెదుళ్లపల్లి, చీరాల, వేటపాలెం, చినగంజాం వరకు ప్రవహిస్తుంది. ఈ విధంగా చూసుకుంటే బాపట్ల మండలంలో 97.20, చీరాల మండలంలో 267, వేటపాలెంలో 650, చినగంజాంలో 460 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. అయితే చీరాల పరిధిలో నేడు ఆ వాగు వాస్తవికతకు చాలా భిన్నంగా మారింది. ఎంచక్కా అవకాశవాదులు ఇష్టారీతిగా ఆక్రమించారు. మరి కొందరు కుందేరును కొంచెం కొంచెంగా పూడ్చి లేఅవుట్‌లు సైతం వేసుకుని వ్యాపారాలు చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం ఉంది. మరికొంత మంది వ్యవసాయ భూముల్లో అవకాశం ఉన్న మేరకు స్వాధీనం చేసుకుని అనుభవిస్తున్నారు. అయితే దీనిపై గతంలో అనేక మంది అధికారులకు ఫిర్యాదులు చేయడంతో పలు మార్లు వ్యవహారం రచ్చకు వచ్చింది. అయితే తాజాగా కలెక్టర్ వెంకటమురళి అధికారులతో సమీక్షించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. భిన్నంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించడంతో విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. ఒక్క చీరాల నియోజకవర్గ పరిధిలోని పెద్ద ఎత్తున ఆక్రమణాలు జరిగాయంటే ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదన్నది జగమెరిగిన సత్యం. అయితే అధికారులు తీసుకునే చర్యలు పారదర్శకంగా ఉంటాయా ఒకవేళ అదే జరిగితే ఆక్రమణదారులపై ఉక్కుపాదం తప్పదా అనేది వేచి చూడాల్సి ఉంది. అయితే వాగు ఆక్రమణలకు సంబంధించి తాజాగా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నారు.


మ్యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ, అధికారులు (ఫైల్)

రాతి ముఖ మండపం పనులు ఆలస్యం

- అందుబాటులో లేని మంచి ముహూర్తాలు
- ఈఏడాది వార్షిక తిరునాళ్లకూ బాలాలయంలోనే స్వామి దర్శనం


శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న రాతి ముఖ మండప పునఃనిర్మాణ పనులు

అద్దంకి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణ పనులు ఒకింత ఆలస్యం అవుతుండడంతో ఈ ఏడాది వార్షిక తిరునాళ్లకు కూడా బాలాలయంలోనే ప్రసన్నాంజనేయస్వా మి దేవాలయంలో స్వామి వారి దర్శనం ఉండనుంది. దీంతో భక్తులు ఒకింత నిరుత్సాహానికి గురవుతున్నారు. శింగరకొండలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం పునఃనిర్మాణ పనులు సుమారు రూ.7కోట్లతో జరుగుతున్నాయి. ఈవోగా తిమ్మానాయుడు బాధ్యతలు తీసుకున్న తరువాత పనులు ఒకింత వేగవంతంగా జరుగుతుండగా, వార్షిక తిరునాళ్ల నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని భావించారు. మూలవిరాట్ వద్దనే తిరునాళ్ల పూజలు, భక్తులకు దర్శనం కల్పించాలని భావించారు. పనులు పూర్తికావడానికి మరో నెల రోజులు సమయం పట్టే అవకాశం కనిపిస్తుండగా, మంచి ముహూర్తాలు కూడా లేనట్లు తెలుస్తుంది. వార్షిక తిరునాళ్ల మార్చి 14 వతేదీన జరగనున్న నేపథ్యంలో ఈ ఏడాది కూడా తిరునాళ్లకు వచ్చే భక్తులు బాలాలయంలోని స్వామి వారిని దర్శించుకోవడంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఉండడంతో భక్తులు ఒకింత నిరుత్సాహానికి గురవుతున్నారు. ఏప్రిల్, మేలో రాతి ముఖమండపం ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

సర్వే భూములను పరిశీలించిన ఆర్డీవో


సర్వేను పరిశీలిస్తున్న చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

ఇంకొల్లు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇడుపులపాడు గ్రామ పరిధిలో రీ-సర్వే జరుగుతున్న భూములను గురువారం చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు గురువారం పరిశీలించారు. రైతులను అడిగి సర్వే వివరాలను తెలుసుకున్నారు. భూముల రీసర్వే సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ వెంకటరత్నం, డీటీ భాగ్యారావు, సర్వేయర్ మునలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సారాకు దూరంగా ఉండండి


స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

చీరాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : సారా తయారీకి దూరంగా ఉండి.. కుటుంబాలతో ఆనందంగా జీవించాలని ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ, సూపరింటెండెంట్ జనార్దన్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన నవోదయం 2.0 కార్యక్రమం గురువారం రామనగర్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ సారా ఉత్పత్తిలో రామనగర్ మొదటి స్థానంలో ఉందని వివరించారు. జీవితాలను చిన్నాభిన్నం చేసే సారా నియంత్రణకు సహకరించాలని, భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పెదగంజాంలో ఉచిత కంటి వైద్య శిబిరం

చినగంజాం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : పెదగంజాంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ గురువారం ప్రకటనలో తెలిపారు.

శరవేగంగా విద్యుత్‌లైన్ విస్తరణ

- మంత్రి గొట్టిపాటి ఆదేశాలతో చకాచకా పనులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఎస్టీకాలనీ వాసులు


జాగర్లమూడివారిపాలెం ఎస్టీకాలనీ వరకు వేసిన విద్యుత్‌లైన్


కాలనీలో వెలుగుతున్న వీధి లైట్లు

పంగులూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో జేవీపాలెం ఎస్టీకాలనీ విద్యుత్ లైన్ విస్తరణ పనులు శరవేగంగా పూర్తయ్యాయి. దీర్ఘ కాలంగా విద్యుత్ లైన్‌ను ఏర్పాటు లేక తాము పడుతున్న ఇబ్బందులను జాగర్లమూడివారిపాలెం ఎస్టీ కాలనీవాసులు, గ్రామ నాయకులు ఈ నెల ఒకటవ తేదీన ముప్పవరం పార్టీ కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎదుట ఏకరువు పెట్టారు. సమస్యపై స్పందించిన మంత్రి గొట్టిపాటి తక్షణ చర్యలు చేపట్టాలని విద్యుత్‌శాఖ ఈఈ మస్తాన్‌రావును ఆదేశించారు. రంగంలోకి దిగిన అధికారులు విద్యుత్‌లైన్ విస్తరణ పనులకు అంచనాలు రూపొందించి, నిర్వహణ పనులకు నిధులను కేటాయించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేసిన అధికారులు గురువారం కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించారు. తాము కోరిన వెంటనే విద్యుత్ సమస్య పరిష్కరించిన మంత్రి రవికుమార్‌కు కాలనీ వాసులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రామకోటేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

చినగంజాం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో నిర్వహించిన తిరునాళ్లకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సోపిరాల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానంలో తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. అభిషేకాలు, కుంకమపూజలు ద్వారా రూ.3,16,500, హుండీ ద్వారా రూ.4,51,438 వచ్చినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా రూ.7,67,938 ఆదాయం రాగా బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తుమ్మలపెంట సీతారామయ్య, టీ.జయరావు, వెంకటసుబ్బారావు, టి.వెంకటస్వామి, పర్వతరెడ్డి హరిబాబు, పల్లపోలు లక్ష్మీనారామణ, కే.రామసుబ్బారావు, పీ.శరభారావు, నున్నా హరనాథ్‌బాబు, నరహరి శ్రీనివాసరావు, టీ.సుబ్బారావు, పి.పార్థసారిధి, ధర్మవరపు ఏసునారాయణ, టి.చిన్నా, పి.పద్మనాభయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సులతో రూ.8.60 లక్షల ఆదాయం

అద్దంకి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు అద్దంకి డిపో నుంచి బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 27 బస్సులను నడపగా రూ.8,61,498 ఆదాయం వచ్చినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. గత ఏడాది 30 బస్సులను నడపగా రూ.7,96,985 ఆదాయం రాగా, ఈ ఏడాది మూడు బస్సులు తక్కువగా నడిపినప్పటికీ రూ.65వేలు అదనంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఎక్కువ ఆదాయం వచ్చేలా కష్టపడ్డ కార్మికులకు డీం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబి అభినందనలు తెలిపారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామి

బల్లికురవ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ-సంతమాగులూరు రోడ్డు నక్కబొక్కలపాడు గ్రామ పరిధిలో ఉన్న భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి కల్యా ణం గురువారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా పూ జారి మధుబాబు ఆధ్వర్యంలో దేవతా మూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని వీనులవిందుగా జరిపించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా అగస్త్యేశ్వరస్వామి గ్రామోత్సవం


స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

చెరుకూరు (పర్చూరు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీఅగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి లింగోద్భవం అనంతరం స్వామివారిని ప్రత్యేక పల్లకిలో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి నాగయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం

- కోరంలేక ఆలస్యంగా ప్రారంభం
- అంతంతమాత్రంగా హాజరైన కౌన్సిలర్‌లు
- రూ.15కోట్లతో మినీ బైపాస్‌కు ప్రతిపాదనలు
- నష్టం వచ్చే టెండర్‌లు రద్దు


మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్ర

మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సమావేశం గురువారం మొక్కుబడిగా సాగింది. కోరం లేక ఛైర్‌పర్సన్ వచ్చిన తరువాత 10 నిమిషాలు వేచి చూడాల్సి వచ్చింది. మున్సిపల్ సమావేశం గురువారం ఛైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మొత్తం 46 అంశాలకుగాను మున్సిపాలిటీకి నష్టం వచ్చే విధంగా వేసిన 6 పనులకు సంబంధించిన టెండర్‌లను రద్దు చేసి రీటెండర్ పిలవాలని తీర్మానించారు. 11గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 11-20కి ఛైర్‌పర్సన్ వచ్చారు. అప్పటికి కోరంకు సరిపడా కౌన్సిలర్‌లు రాకపోవడంతో మరో 10 నిమిషాలు వేచి ఉండి 11-30 గంటలకు ప్రారంభించారు. 46 అంశాలు ఉన్న అజెండా సుమారు 30 నిమిషాల పాటు సాగిన సమావేశంలో 40 అంశాలను ఆమోదించారు. 6 అంశాలకు సంబంధించిన టెండర్‌లు 4.99 శాతం అధికంగా కోట్ చేయడంతో మున్సిపాలిటీకి నాలుగైదు లక్షల నష్టం వచ్చే అవకాశం ఉండడంతో వాటికి సంబంధించి రీటెండర్‌లు పిలవాలని నిర్ణయించారు. అభివృద్ధి పనులపై అటు వైసీపీ, టీడీపీ కౌన్సిలర్‌లు పెద్దగా నోరు విప్పి మాట్లాడలేదు. 20వ వార్డు కౌన్సిలర్ కోటేశ్వరరావు మాత్రం శింగరకొండ తిరునాళ్ల నాటికి నామ్ రోడ్డులో సెంటర్ లైటింగ్‌లో మరమ్మతులు పూర్తి చేయాలని కోరారు. గతంలో రద్దు చేసిన టెండర్‌లను వెంటనే పిలిచి పనులు పూర్తి చేయాలని కోరారు. హాజరైన పలువురు కౌన్సిలర్‌లు సంతకాలు చేసి వెళ్లి పోవడంతో సమావేశంలో కౌన్సిలర్ హాజరు తక్కువగా ఉంది. పలు సందర్భాలలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర వివరణ ఇస్తూ అద్దంకి పట్టణంలోని కాలువ కట్టను మినీ బైపాస్‌గా మార్చేందుకు మంత్రి రవికుమార్ ఆదేశాలతో రూ.15కోట్లతో ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. దర్శి రోడ్డులో డివైడర్ మధ్య గ్రీనరీ పెంచి, రక్షణగా ఇనుప కంచెను ఏర్పాటు చేస్తామన్నారు. మంచినీటి క్లోరినేషన్‌కు చర్యలు చేపడతామన్నారు. వైస్ ఛైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిలర్‌లు, మేనేజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సాగుభూముల్లో రోడ్డు నిర్మాణం చేపట్టొద్దు

తూర్పు కొప్పెరపాడు దళిత రైతుల విజ్ఞప్తి

పంగులూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తమ భుక్తి కోసం కేటాయించిన సాగు భూమిలో రహదారి కోసం రోడ్డు నిర్మించే చర్యలు చేపట్టవద్దని తూర్పు కొప్పెరపాడు గ్రామ దళిత రైతులు తహసీల్దార్ సింగారావుకు విజ్ఞప్తి చేశారు. పంగులూరుకు చెందిన రైతు తమ పొలంలోకి వెళ్లేందుకు దారి కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోగా, సర్వే చేసేందుకు తహసీల్దార్ సింగారావు సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై సీపీఎం నాయకులు రాయిణి వినోద్ దళిత రైతుల సమస్యపై గురువారం తహసీల్దార్‌ను ల్దార్ కలిసి సమస్యను వివరించారు. కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయించుక్ను వారికి ప్రభుత్వం గతంలో సర్వే నెంబరు 254లో 20 మందికి 30 నుంచి 40సెంట్ల బంజరు భూమిని కేటాయించినట్లు తెలిపారు. తాము సాగు చేసుకునే పట్టా భూమి మధ్యగా దారి కోసం రోడ్డు నిర్మా ణం చేపడితే తాము నష్టపోతామన్నారు. శనివారం సదరు భూమిని పరిశీలించి ఇబ్బంది లేకుండా చూస్తామని తహసీల్దార్ సింగారావు తెలిపార. కార్యక్రమంలో వీఆర్వో నూతలపాటి సుధాకర్, సర్వేయర్ ఎలీషా, సనందబాబు, రాంబాబు పాల్గొన్నారు.

దాబా ఘటనపై కేసు

మార్టూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి జొన్నతాళి సెంటర్ సమీపంలో దాబా హోటల్‌లో బుధవారం రాత్రి కోలలపూడి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు హోటల్ యజమాని గూగూలాతోపాటు సర్వర్ రాజుపై దాడి చేసిన ఘటనకు సంబంధించి గురువారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ గురుత్మంతుడు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రావూరి శ్రీకాంత్‌తో పాటు కొంత మంది వ్యక్తులు హోటల్‌లో టిఫిన్ చేసి బిల్లు ఇవ్వకుండా వెళుతున్న క్రమంలో, అదేమిటని అడిగిన హోటల్ యజమాని గూగూలా, సర్వర్ రాజుపై సీసాతో దాడిచేసి గాయపరిచారు. దాంతో గాయపడిన వారిద్దరూ మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. వారిలో గూగూలా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గరుత్మంతుడు తెలిపారు.

ఇంటిలో చోరీ

8.5 సవర్ల బంగారు ఆభరణాలు మాయం

మార్టూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మద్దిసీతాదేవీనగర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు పచ్చవ శరణ్య అనే మహిళ ఇంటిలో చొరబడి బీరువాలో ఉన్న 8.5 సవర్ల బంగారు ఆభరణాలను ఎత్తుకుపోయిన సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. వాటి విలువ దాదాపుగా రూ.5లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కాంప్లెక్స్‌కు వెళ్లేదారిలో టీవీఎస్ షోరూం సమీపంలో ఉన్న ఒక షాపులో వెంకటేశ్వర్లు శరణ్య దంపతులు మిషన్లు రిపేరు పనులు చేస్తుంటారు. గురువారం మధ్యాహ్న సమయంలో షాపు నుంచి ఇంటికి వెళ్లిన శరణ్య దుస్తులను ఉతికి ఆరవేసేందుకు డాబా పైకి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించారు. ఇంటిలో బీరువాకు ఉన్న తాళం చెవులను తీసుకొని బీరువా తలుపులు తెరచి నాలుగు సవర్లు గల డాలరుతో ఉన్న నల్లపూసలతాడు, 2 సవర్ల బ్రాస్‌లెట్, మరో రెండున్నర సవర్ల గొలుసు ఎత్తుకు పోయారు. కొంచెంసేపటి తర్వాత డాబా పైనుంచి కిందికి దిగి ఇంటిలోకి వెళ్లిన శరణ్య బీరువా తలుపులు తెరచి ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శేషగిరిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్ఎంకు మాతృవియోగం


సామ్రాజ్యం

పంగులూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ముప్పవరం పీఎస్ఎస్‌సీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుచ్చకాయల ప్రసాద్ తల్లి పుచ్చకాయల సామ్రాజ్యం (78) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈమె భర్త దివంగత పుచ్చకాయల కృష్ణమూర్తి గతంలో పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆమె అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం ముప్పవరంలో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

కేఆర్‌కే మృతిపై ఎమ్మెల్యే ఏలూరి సంతాపం


కేఆర్‌కే ప్రసాద్

నాగులపాలెం (పర్చూరు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నాగులపాలెం కళావాణి వ్యవస్థాపకులు, కళాకారుడు కేఆర్‌కే ప్రసాద్ మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. గురువారం కేఆర్‌కే మృతి చెందిన విషయం తెలుసుకున్న ఏలూరి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రసాద్ మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటన్నారు. ప్రారంభం నుంచి మంచి కళాకారునిగా గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి అని కొనియాడారు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు సినీ పరిశ్రమల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారు. నేడు నాగులపాలెంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టీబీ రహిత గ్రామాల ఎంపిక

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మోదేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2024 సంవత్సరానికి సంబంధించి టీబీ రహిత గ్రామాలుగా గోపాలపురం, ఉప్పలపాడు, పేరాయపాలెం పంచాయతీలు ఎంపికైనట్లు బాపట్ల జిల్లా ఎయిడ్స్, టీబీ, లెప్రసీ అధికారి డాక్టర్ సాదిక్ తెలిపారు. గురువారం మండలంలోని గోపాలపురం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గోపాలపురం, పేరాయిపాలెం, ఉప్పలపాడు గ్రామాలలో అన్ని రకాల టీబీ పరీక్షల అనంతరం జీరో కేసులు నమోదైనట్లు తెలిపారు. దీనిలో భాగంగానే గోపాలపురం గ్రామాన్ని సందర్శించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీహర్ష, ఎస్‌టీసీఎస్ రాజశేఖర్, వెంకటరత్నం, సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శింగరకొండలో ఘర్షణ

అద్దంకి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద గురువారం యువకులు, దుకాణ నిర్వాహకుడి మధ్య ఘర్షణ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మధ్యాహ్నం ముగ్గురు యువకులు షాపు వద్ద కొనుగోలు కోసం వచ్చారు. ఈ సమయంలో మాటామంతి పెరిగి ఘర్షణ పడ్డారు. మిగిలిన షాపుల యజమానులు కూడా అక్కడకు చేరుకొని యువకులకు దేహశుద్ధి చేసి పంపారు. ఘర్షణ జరుగుతుండడంతో అక్కడ ఉన్న భక్తులు ఒకింత అయోమయానికి గురయ్యారు. యువకులు తప్పు చేసి ఉంటే అటు దేవాలయ సిబ్బంది, అధికారులు లేదా పోలీస్ లకు సమాచారం ఇచ్చి అప్పగించాల్సింది పోయి ఏకంగా దాడి చేయడం విమర్శలకు తావిస్తుంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఘటన గురువారం రాత్రి మున్సిపల్ కార్యాలయం ఎదుట చోటుచేసుకుంది. అతనికి సుమారు 41 సంవత్సరాలు ఉంటాయి. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అతనివద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జిల్లా సదస్సును జయప్రదం చేయండి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాలో మార్చి 4న జరగనున్న దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సదస్సుకు దళితులందరూ హాజరై జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవాది సుబ్బారావు పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ కార్యాలయంలో డీహెచ్‌పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నిష్పత్తి ప్రకారం కేటాయించాలన్నారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి నష్టపరిహారాన్ని బాధిత కుటుంబాలకు వెంటనే చెల్లించాలని, కుటుంబాలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కన్వీనర్ వీరయ్య, నాయకులు సింగరకొండ, జోసఫ్, హేబేలు, జ్యోతి రమేష్‌బాబు, ఆంజనేయులు, గద్దల రమేష్ పాల్గొన్నారు.



భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరునికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ముక్కంటి కల్యాణం..

మురిసెను ముల్లోకం



ఆదిదంపతుల వివాహాన్ని కనులారా వీక్షిస్తున్న భక్తజనం

తరలివచ్చిన భక్తులే అతిథులుగా.. ఆకాశమే పందిరిగా.. భూలోకమే పీటలుగా.. వేదపండి తుల మంత్రోచ్చర ణలు.. మంగళవాయిద్యాల నడుమ భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వర స్వామివారి కల్యాణం గురువారం రాత్రి అట్టహాసంగా జరిగింది. నగరంలోని మూలపేటలోని మూలస్థానేశ్వ రాలయంలో శివరాత్రి ఉత్సవాలు అంతరంగ వైభవంగా జరుగుతున్నాయి. శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం రాత్రి ఆలయంలో భక్తులు జాగరణ చేశారు. ఆ తర్వాత గురువారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కాగా, రాత్రి ఆదిదంపతుల కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణమూర్తులైన మూల స్థానేశ్వరస్వామి భువనేశ్వరి అమ్మవారికి ఎదురుకోలు ఉత్సవం జరిగింది. ఆలయ ఈవో అర్చభూమి శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, ఉభయకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు స్వామి, అమ్మవార్లు రథంపై కొలువుదీరి పురవీధుల్లో విహరించనున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

అడల్ట్ బీసీజీ లక్ష్యంలో జిల్లా ఫస్ట్!

- 78 శాతం వ్యాక్సిన్ వేసిన ఆరోగ్య సిబ్బంది

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయను నివారించేందుకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ వృద్ధులకు అడల్ట్ బీసీజీ (బేసిలెస్ కల్మిటి గూరిన్) వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చింది. గత ఏడాది మే 16వ తేదీన 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఈ వ్యాక్సిన్ వేసేందుకు శ్రీకారం చుట్టారు. ప్రతి గురువారం వైద్యసిబ్బంది వృద్ధులకు ఈ వ్యాక్సిన్ వేస్తున్నారు. రాష్ట్రంలో చాలా జిల్లాలు ఇప్పటివరకు 40 శాతం కూడా వ్యాక్సిన్ వేయలేదు. అయితే వైద్యాధికారుల చేసి కృషి ఫలితంగా వృద్ధులకు వ్యాక్సిన్ వేయడంలో రాష్ట్రంలోనే నెల్లూరు ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలో 6,89,286 మందికి 78 శాతం మందికి వ్యాక్సిన్ వేశారు. వైఎస్సార్ కడప జిల్లా రెండవ స్థానంలో నిలిచింది. మార్చి నెలాఖరు వరకు గడువు ఉండటంతో పూర్తి లక్ష్య సాధనకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కుష్టు నివారణకు కృషి చేయండి

కుష్టువ్యాధి నివారణలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలోని కుష్టు విభాగంలో ఆయన అధికారులతో సమీక్షించారు. ఇటీవల కుష్టువ్యాధిని గుర్తించే సర్వే పూర్తయిందన్నారు. ఇందులో 28 మంది కొత్త వారిని గుర్తించినట్లు చెప్పారు. వీరికి సకాలంలో వైద్య సేవలు అందేలా కృషి చేయాలని సూచించారు. వ్యాధిగ్రస్థులకు అంగ వైకల్యం ఉంటే వారిని డీఎఫ్ఐటీ ఆసుపత్రికి పంపించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో వైద్యులు సురేంద్రబాబు, నరసింహులు, ప్రసాదాచారి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ వివరాలు యాప్‌లో నమోదు చేయాలి

నెల్లూరు (హరనాథపురం) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ వివరాలను యాప్‌లో నమోదు చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి వెలుగు సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆమె చాంబర్ నుంచి ఉద్యోగులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం ఉదయమే పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్న లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ జరిగినప్పుడు అందుకు గల కారణాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరి ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేసిన తర్వాత వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. కాగా, జిల్లాలో 3,07,232 మంది పింఛనుదారులకు రూ.132.6 కోట్ల పింఛన్ మొత్తాన్ని శనివారం పంపిణీ చేయనున్నారు.

ఇంటర్ పరీక్షలకు

సర్వం సిద్ధం

- రేపటి నుంచి 79 కేంద్రాల్లో నిర్వహణ
- 53,200 మంది విద్యార్థుల హాజరు
- హై పవర్ కమిటీతో పర్యవేక్షణ
- ప్రతి కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలతో నిఘా
- అధికారుల సమీక్షలో ఆర్ఐవో శ్రీనివాసులు

శనివారం నుంచి జరిగే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. మార్చి 20వ తేదీ వరకు 79 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్, ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. గురువారం నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రైవేట్ కళాశాలల ప్రతినిధులు, చీఫ్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లైయింగ్, సిట్టింగ్‌స్క్వాడ్ సిబ్బందితో ఆయన సమీక్షించారు. పరీక్షల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఆర్ఐఓ హెచ్చరించారు. అనంతరం పరీక్షల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : 'ఇంటర్ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్నాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. 8.30 గంటలకే పరీక్షా విద్యార్థులకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. నిర్ణీత సమయం దాటాక సహేతుక కారణాలతో కేంద్రానికి చేరుకునే విద్యార్థులను చీఫ్ సూపరింటెండెంట్ పరిశీలించి 2 నుంచి 5 నిమిషాల ఆలస్యం వరకు కేంద్రంలోకి అనుమతిస్తారు. ఇక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు 1400 మంది సిబ్బందిని, హైపవర్ కమిటీతోపాటు జిల్లా పరీక్షల కమిటీ, 4 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 5 సిట్టింగ్ స్క్వాడ్లు నియమించాం. విద్యార్థులకు పూర్తిస్థాయి వసతులు కల్పించడంతోపాటు ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాము. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు జెరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశాము.

ఇంటర్ విద్యార్థులు	53,200 మంది
జూనియర్లు	28,176 మంది
సీనియర్లు	25,024 మంది
పరీక్ష కేంద్రాల సంఖ్య	79
సమస్యాత్మక కేంద్రాలు	12
సమయం	ఉదయం 9 నుంచి 12 గంటల వరకు
అధికారులు	1400 మంది
కంట్రోల్ రూం నెం.	0861-2320312

నిబంధనలు కఠినం

పరీక్షలకు నియమించిన అధికారుల సెల్‌ఫోన్లను జీపీఎస్ సిస్టమ్ ద్వారా ఇంటర్‌బోర్డు ట్రాకింగ్ చేస్తుంది. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు ఎవరూ సెల్‌ఫోన్‌లు, క్యాలుకులేటర్లు వంటి వస్తువులు, కాగితాలను తీసుకెళ్లకూడదు. ఫీజులు చెల్లించ లేదని, ఇతర కారణాలతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవు. విద్యార్థులే నేరుగా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించాము. హాల్‌టికెట్‌పై కళాశాల స్టాంపింగ్, ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్షకు అనుమతిస్తామని తెలిపారు. అలాగే ఈ ఏడాది లాటరీ పద్ధతిలో ఇన్విజిలేటర్లకు గదులను కేటాయిస్తామని, సిబ్బంది గుర్తింపు కార్డులు ధరించి పరీక్షలకు హాజరవ్వాలి. ఎవరైనా మాల్ ప్రాక్టీస్‌కు గురైతే పరీక్ష ముగిసిన తరువాత ఆ విద్యార్థిని వారి తల్లిదండ్రులకు లేదా కళాశాల యాజమాన్యానికి అప్పగించాలి.



కేఏసీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్ఐవో

12 సమస్యాత్మక కేంద్రాలు

జిల్లాలో 79 పరీక్షా కేంద్రాలలో 12 కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించాము. వీటిపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే పోలీస్ స్టేషన్లలో ఉన్న ప్రశ్నపత్నాలను పరీక్షకు అర్ధగంట ముందు స్టేషన్ నుంచి తీసుకెళ్లేలా అధికారులకు ఆదేశాలిచ్చామ. ఇక ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు స్క్రైబ్ సౌకర్యంతోపాటు పరీక్ష కేంద్రంలోనే కింద గదుల్లో పరీక్ష రాసే వెసులుబాటు కల్పించాము. పరీక్షల నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఉంటే ఆర్ఐఓ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చు.' అని అన్నారు. ఈ సమావేశంలో డీఈసీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



ముమ్మరంగా సాగుతున్న వరికోతలు

మార్చి నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం

రెండో పంట మాటేమిటి!?

సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు

నీటి కేటాయింపుల కోసం రైతాంగం ఎదురుచూపు

నెల్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొదటి పంట చివరి దశకు చేరుకుంది. గూడూరు, నాయుడుపేట డివిజన్లలో వరి కోతలు దాదాపుగా పూర్తవగా, నెల్లూరు, కావలి, ఆత్మకూరు డివిజన్లలో ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సీజన్‌లో ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు ఉండడంతో సకాలంలో సాగు మొదలైంది. నవంబరులోనే చాలా వరకూ నార్లు పోశారు. దీంతో మార్చి నెలాఖరుకు వరి కోతలు పూర్తయ్యే అవకాశం ఉన్నట్టు వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండో పంట మాటేమిటన్న చర్చ జరుగుతోంది. రెండో పంటపై అధికారుల నిర్ణయం కోసం రైతాంగం ఆశగా ఎదురు చూస్తోంది. గతేడాది రెండో పంట ఊసేలేదు. అయితే ప్రస్తుతం సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నాయి. దీంతో ఆ నీటితో ఎంత ఆయకట్టు వరకు సాగుకు నీటి కేటాయింపులు ఇస్తారన్నది చర్చనీయాంశమైంది. అధికారుల నిర్ణయం ఆధారంగా రైతులు వరి పంట వేసుకోవాలా!? లేదా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలా!? అన్నది ఆధారపడి ఉంది. ప్రస్తుతం సోమశిలలో 59.57 టీఎంసీలు నీరు ఉంది. మొదటి పంట పూర్తయ్యేందుకు మరో ఆరేడు టీఎంసీలు అవసరమవుతాయని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక డెడ్ స్టోరేజీ, తాగునీటి అవసరాలు, నీటి ఆవిరి, గణేష్ నిమజ్జనం, రొట్టెల పండుగ వంటి అవసరాలకు మరో 17 టీఎంసీలు వరకూ అవసరమవుతాయి. ఈ లెక్కన నికరంగా సోమశిలలో రెండో పంటకు 35 టీఎంసీల వరకూ మిగిలే అవకాశముంది. ఆ నీటితో సోమశిల ప్రాజెక్టు కింద 3 లక్షల ఎకరాల వరకూ రెండో పంటకై ఆయకట్టుకు నీరిచ్చే వీలు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అలానే కండలేరులో ప్రస్తుతం 51.938 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ప్రస్తుత సాగుకు మరో రెండు టీఎంసీల వరకూ అవసరమవుతాయని అంచనా. ఇక డెడ్ స్టోరేజీ, చెన్నై, ఉమ్మడి జిల్లా తాగునీటి అవసరాలు, పరిశ్రమలకు నీటి అవసరాలు, నీటి ఆవిరి అన్నీ కలుపుకుంటే మరో 25 టీఎంసీల వరకూ అవసరమవుతాయి. వీటన్నింటికీ పోను కండలేరులోనూ నికరంగా 25 టీఎంసీలు రెండో పంటకు మిగలనున్నాయి. ఆ నీటితో ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు లక్షల ఎకరాలకుపైగా సాగుకు ఇచ్చేందుకు వీలు కలుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే సోమశిల, కండలేరు జలాశయాల పరిధిలో రెండో పంట కింద ఈ ఏడాది ఐదు లక్షల ఎకరాలకు తగ్గకుండా సాగుకు నీరిచ్చేందుకు అవకాశాలు ఉన్నాయి. దీంతో రైతాంగం కూడా సంతోషంగా ఉంది. అయితే కేటాయింపులపై అధికారులు త్వరగా నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వందశాతం లక్ష్యాలు సాధించాలి

వైద్యాధికారులతో ఉప సంచాలకుడు శ్రీనివాసులరెడ్డి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఉప సంచాలకుడు శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన ప్రగతి కార్యక్ర మాలు 100 శాతం లక్ష్యాలు సాధిం చేలా కృషి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఉపసంచాలకుడు శ్రీనివాసులరెడ్డి ఆదేశించారు. గురువారం నెల్లూరు పర్యటనకు వచ్చిన ఆయన డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత చాంబర్‌లో అధికారులతో మాట్లాడారు. అలాగే జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్‌తోనూ చర్చించారు. అనంతరం శ్రీనివాసులరెడ్డి మాట్లా డుతూ జనన, మరణాలను సకాలంలో ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఆసుపత్రిలో బిడ్డ పుట్టిన వెంటనే వారికి ఆధార్ నమోదు చేయాల న్నారు. శిశుఆధార్, జనన ధ్రువీకరణ పత్రం జారీ అయ్యేలా జిల్లా వైద్యాధికారులకు సూచనలిచ్చారు. జీజీహెచ్‌లో శిశు ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించిన ఆయన ప్రతి ఒక్కరూ ఆయా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయా లని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఏపీ మెడి కల్ అండ్ హెల్త్ స్టాటిస్టికల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెమో కనకరత్నం, స్టాటికల్ అధికారి కే. సహన, డిప్యూటీ ఎస్‌వో మల్లికార్జున, డీపీహెచ్ ఎన్‌వో మంజుల, డీపీవో డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

శాస్త్రీయ సలహా మండలి సమావేశం రేపు

నెల్లూరు (వ్యవసాయం) : నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రంలో (కేవీకే) శనివారం శాస్త్రీయ సలహా మండలి సమావేశం జరుగుతుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ జి.లలితాశివజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రైతులు పాల్గొని పంటల్లో వచ్చే సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకొచ్చి సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు.

ఈ నెల 25న బడ్జెట్‌పై అధికారులతో సమావేశమైన మేయర్ స్రవంతి



బడ్జెట్ రూపకల్పనలో బయటపడ్డ సమన్వయలోపం

కార్పొరేషన్‌లో

ఎవరికివారే!

- మేయర్, కమిషనర్లు వేర్వేరుగా సమీక్షలు
- తలలు పట్టుకుంటున్న అధికారులు

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో మేయర్, కమిషనర్లు జోడెద్దులాంటి వాళ్లు. ఇందులో ఎవరు వెనకడుగు వేసినా, ముందుకెళ్లిన పాలనపై తీవ్ర ప్రభాం చూపుతుంది. ఇప్పుడు నగర పాలక సంస్థలో అదే జరుగుతోంది. మేయర్ స్రవంతి, కమిషనర్ సూర్యతేజల మధ్య ఇప్పటి వరకు ఉన్న కోల్డ్ వార్ కాస్త రోడ్డెక్కింది. వీరి మధ్య సమన్వయలోపం పూర్తిగా గాడితప్పిందన్న సంకేతాలు తాజాగా నిర్వహించిన బడ్జెట్ సమీక్షల ద్వారా బట్టబయలైంది. 2025-26 ఆర్థిక ఏడాదికి నూతన బడ్జెట్‌ను రూపొందించడానికి మంగళవారం మేయర్ స్రవంతి కార్పొరేషన్‌లోని తన ఛాంబరులో విభాగాధిపతులతో సమీక్షించారు. అన్ని రంగాలను బేరీజు వేసుకుని పొద్దు రూపకల్పన చేయాలని సూచించారు. కాగ గురువారం తన చాంబరులో కమిషనర్ సూర్యతేజ ఇదే బడ్జెట్ రూపకల్పనపై విభాగాధిపతులతో సమీక్షించి కేటాయింపులపై ఆరా తీశారు. ఒకే బడ్జెట్‌పై అటు మేయర్, ఇటు కమిషనర్లు రోజుల వ్యవధిలో సమీక్షలు నిర్వహించి కేటాయింపులపై వ్యత్యాసాలతో కూడిన పొద్దులను సిఫారసు చేయడం అధికారులకు తలనొప్పిగా మారింది.

గత కొన్ని రోజులుగా కోల్డ్‌వార్

కార్పొరేషన్‌లో మేయర్, కమిషనర్‌ల మధ్య కొన్ని రోజులుగా కోల్డ్‌వార్ నడుస్తోంది. కమిషనర్ నూతన వాహనం కొనుగోలు చేయాలని ఫైలు తయారు చేసి ఆమోదానికి మేయర్ వద్దకు పంపగా ఆమె తిరస్కరించినట్లు సమాచారం. అక్కడ నుంచి ఇరువురి మధ్య సమన్వయ లోపం అనేక అంశాల్లో హెచ్చుతగ్గులతో వస్తోంది. చెత్త వాహనాలకు డీజిల్ సప్లయ్ చేస్తున్న పెట్రోల్ బంకును మార్చాలని మేయర్ పట్టుపట్టడం, దానికి కమిషనర్ ససేమీరా అనడం అప్పట్లో కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కమిషనర్ సీసీ ప్రవీణ్ మేయర్ పేషీలో ప్రింట్లు తీస్తుండగా ఆమె భర్త జయవర్ధన్ తలుపులేయడం అనంతరం సీసీ ఫిర్యాదుతో జయావర్ధన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడం వీరి మధ్య మరింత దూరం పెరిగేలా చేసింది. తాజాగా బడ్జెట్ సమావేశాలు సైతం ఇరువురు వేర్వేరుగా నిర్వహించడం నగరంలోని రాజకీయ, అధికార వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది.



గురువారం తన చాంబర్‌లో అధికారులతో సమావేశమైన కమిషనర్ సూర్యతేజ

ఆకట్టుకున్న సైన్సు ఎగ్జిబిషన్

కావలిటౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్సు దినోత్సవ ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా జేవీవీ ఆధ్వర్యంలో గురువారం రెడ్‌క్రాస్ భవనంలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవి కుమార్, డాక్టర్ మాలిని, డాక్టర్ రమ్య, డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, అనూషారెడ్డిలు పాల్గొని ఎగ్జిబిట్స్‌ను తిలకించి విద్యార్థులను అభినందించారు. వైద్యులు మాట్లాడుతూ ఇటువంటి సైన్సు ప్రదర్శనలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, చైతన్యం పెంపొందించడానికి దోహదపడతాయన్నారు. ప్రముఖ సామాజిక గాయకులు రామ చంద్రయ్య, రమణయ్యలు సైన్సు ఆవశ్యత ఔనత్యాన్ని చాటుతూ పాడిన పాటలు ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, జేవీవీ కార్యదర్శి హరనాథ్, సుబ్బరాయశర్మ పాల్గొన్నారు.


సైన్సు ఎగ్జిబిట్స్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చెత్తతో సంపదపై అవగాహన ఉండాలి : డీఎల్‌పీవో


మొక్క నాటుతున్న డీఎల్‌పీవో క్రిష్ణమోహన్

కొండాపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీపై ఈవోపీఆర్‌డీలకు అవగాహన ఉండాలని కందుకూరు డీఎల్‌పీవో క్రిష్ణమోహన్ అన్నారు. డివిజన్ పరిధిలోని 7 మండలాల ఈవోపీఆర్‌డీలకు మండలంలోని గొట్టిగుండాలలో గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రాల్లో తయారు చేసి న సేంద్రియ ఎరువును రైతులకు విక్రయిం చడం ద్వారా వచ్చే నిధులతో పంచాయ తీలలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిం చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. నెల్లూరు నుంచి వచ్చిన రిసోర్స్ పర్సన్ రమేష్ ఇళ్ల నుంచి చెత్తను ఎలా సేకరిం చాలి, కేంద్రానికి చేరిన తర్వాత తడి, పొడి చెత్తను ఎలా వేరుచేయాలి అనే విషయా లపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఈవోపీఆర్‌డీ లతోపాటు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచు డి.కొండలరావు, ఎంపీటీసీ వేమిరెడ్డి మల్లికార్జున పాల్గొన్నారు.

భూముల రీసర్వేను ప్రజలు వినియోగించుకోండి

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ


అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

కొండాపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేను ప్రజలు వినియోగించుకోవాలని కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ అన్నారు. మండలంలోని కొమ్మి పంచాయతీ కుంకువారిపాలెంలో జరుగుతున్న భూముల రీసర్వేను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే సమయంలో గ్రామంలోని ప్రజలు ఇతర ప్రాంతాలలో ఉన్నవారు గ్రామానికి వచ్చి తమ భూములకు సంబంధించిన సమగ్ర విషయాలను తెలుసుకోవాలన్నారు. సర్వేయర్లు అన్ని వివరాలను రైతులకు తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎమ్.కోటేశ్వరరావు, వీఆర్‌వో మహేష్, సర్వేయర్ల బృందంతోపాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

టైలర్స్‌కు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ఆదుకోవాలి

కావలి, ఫ్రిబవరి 27(ఆంధ్రజ్యోతి): టైలర్స్ వృత్తిలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ప్రభుత్వం టైలర్స్‌కు రాయితీలు ఇచ్చి ఆదుకోవాలని టైలర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో కావలి టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రమేష్, కార్యదర్శి షేక్ రెహమాన్, కోశాధికారి పీ.వేణు, సలహాదారు షేక్ రఫీలు మాట్లాడారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి ఏవీఎస్ కల్యాణ మండపం వరకు పెద్ద ర్యాలీ నిర్వహించి అనంతరం సభ జరుగుతోందన్నారు. టైలర్స్ అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ సభ్యులు అల్తాఫ్, రెహమాన్, రసూల్, జమీర్, లక్ష్మయ్య, బద్రీనాథ్, సిరాజ్, శ్రీను, గోపి తదితరులు పాల్గొన్నారు.

సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ ఏఎంవో శాంతకుమారి

సంగం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడి సీ, డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ ఏఎంవో శాంతకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఆమె మండలంలోని మర్రిపాడు గిరిజన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పిల్లల హాజరు రిజిష్టర్, పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వంగల్లులోని యూపీ, దళితవాడలోని పాఠశాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఐటీడీఏ జీసీడీవో శాంతి పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ


విద్యాసామగ్రి అందజేస్తున్న వైద్యులు సాహెబ్‌పీర్

దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం శ్రీచైతన్య ఐటీఐ, ఉదయగిరి వారి సౌజన్యంతో విద్యాసామగ్రి అందజేశారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కిమ్స్ వైద్యశాల కార్డియాలజిస్టు డాక్టర్ సాహెబ్ పీర్ పరీక్షల సమ యంలో విద్యార్థులు తీసు కోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. వత్తిడిని ఎలా అధిగమించాలి, ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ ఖాదర్‌బాషా, ప్రిన్సిపాల్ గురవారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, సీనియర్ ఉపాధ్యాయిని ఫాతిమాజాన్, సిబ్బంది పాల్గొన్నారు.

దౌర్జన్యాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు : సీఐ

ఏఎస్ పేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వారి ఆలాన పాలన చూసే కేర్ టేకర్లు దౌర్జన్యలు చేసిన, హింసించినా చట్టరీత్యా చర్యలు తప్పవని సంగం సీఐ వేమారెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేర్ టేకర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ వద్ద ఉన్న మతిస్థిమితం లేని వారి ఆధార్ కార్డులతో సహ పూర్తి వివరాలు పోలీస్‌స్టేషన్‌లో అందించాలని, వారికి నెల నెలా వైద్య పరీక్షలు చేయించాలని తెలిపారు. ట్రస్ట్ నిబంధనలు పాటించాలని సూచించారు.

చింతచెట్టు నరికివేతపై ఫిర్యాదు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంచెరువు బస్టాండ్ సెంటర్ సమీపంలోని రచ్చబండ వద్ద ఉన్న ఓ చింతచెట్టును అదే గ్రామానికి చెందిన వీఆర్‌ఏ చెన్నకేశవులు నరికివేసినట్లు గురువారం ఆర్అండ్‌బీ ఏఈ మస్తాన్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ చెట్టు జోలికి వెళ్లవద్దని గ్రామస్థులు వారించి నప్పటికీ పట్టించుకోకుండా వీఆర్‌ఏ బుధవారం రాత్రి సమయంలో నరికివేశాడు. దీంతో స్థానికులు ఆర్అండ్‌బీ స్థలంలోని చెట్టును అక్రమంగా నరికివేసినట్లు ఏఈకి సమచారం అందించారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది గ్రామానికి వెళ్లి పరిశీలించిన అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శ్రీశైలంలో కావలి చిన్నారి ప్రతిభ

కావలిటౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) శ్రీశైలం మహాశివరాత్రి మహోత్సవంలో కావలికి చెందిన చిన్నారి చక్రికాశ్రీ భరతనాట్యంలో అద్భుత ప్రతిభ కనబరిచి నిర్వాహకులు ఆధ్యాత్మిక కళా ప్రముఖుల ప్రశంలందుకుంది. కావలిలో 4వ తరగతి చదువుతున్న శ్రీనివాసరావు నాగమణి దంపతుల కుమార్తె చక్రికాశ్రీ శ్రీశైలం మహాశివరాత్రి మహోత్సవంలో నాట్యప్రదర్శన అందించేందుకు ఎంపికై బుధవారం రాత్రి శ్రీశైలం దేవస్థానంలో జరిగిన నాట్యప్రదర్శనలో ఓం నమశ్శివాయ భక్తి పాటలకు తన నాట్యప్రతిభా కౌశల్యంతో అందించి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ బాధ్యులు చిన్నారిని ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రం జ్ఞాపిక అందించారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం


కావలిటౌన్ : నంది వాహనంపై విహరిస్తున్న మల్లన్న

ఉలవపాడు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం సాయిబాబా మందిరంలో శివరాత్రిని పురస్కరించుకొని గురువారం శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని ఉమామహేశ్వరులకు బుధవారం రాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకం జరిగింది. గురువారం ఉదయం జరిగిన స్వామివారి కల్యాణోత్సవంలో కందుకూరు మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మన్నేటికోటలో గంగాపార్వతి సమేత అమరలింగేశ్వర స్వామి కల్యాణం జరిగింది. ఉలవపాడులోని శివాలయంలో చిన్నారుల నాట్యం అలరించింది.


కలిగిరి : గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

నందివాహనంపై మల్లన్న గ్రామోత్సవం

కావలిటౌన్ : కావలి పట్టణం పాతూరులోని రుద్రపాద క్షేత్రంలోని అఖిలాండ బ్రహ్మాండ నాయకుడు శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మల్లన్నకు నందివాహనసేవ, గ్రామోత్సవం నిర్వహించారు. శివాలయం వంశ పారంపర్య ప్రధాన అర్చకులు శశిగురుకుల్ పర్యవేక్షణలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఉదయం హోమం, బలిహరణ పల్లకిసేవ, విశేష అభిషేకార్చనలు జరిగాయి. రాత్రి శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తగ్గని భక్తుల రద్దీ

లింగసముద్రం : లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్యస్వామి దర్శనానికి రెండవ రోజూ భక్తుల రద్దీ తగ్గలేదు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు గురువారం కోటయ్యస్వామిని దర్శించుకొని పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. దీంతో రోడ్లు భక్తులతో కిటకిటలాయి. అంగళ్ల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది.

రామలింగేశ్వరుడి గ్రామోత్సవం

కలిగిరి : పట్టణంలో వెలసియున్న పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి స్వామి, అమ్మవారికి కల్యాణం నిర్వహించారు. అనంతరం విశేష పుష్పాలంకరణతో పట్టణంలో గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.


జలదంకి : పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

వైభవంగా మహాలింగోద్భవం

జలదంకి : జలదంకిలో గంగాసమేత జానకి రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి మహాలింగోద్భవం జరిగింది. అనంతరం అభిషేకం, నందిసేవ, నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శివలింగానికి పూజలు చేశారు. గజవాహ నంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో సోమశిల ప్రాజెక్ట్ వైస్‌చైర్మన్ పి.మధురెడ్డి, నాయకులు కే.మాలకొండారెడ్డి, సీహెచ్ జనార్దన్ రెడ్డి, వీ.సుబ్బారెడ్డి, కే.దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సంగమేశ్వరుడి గ్రామోత్సవం

సంగం : సంగమేశ్వరాలయంలో గురువారం తెల్లవారుజామున కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి నంది వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ విగ్రహాలను గజ పూలమాలలతో అలంకరించారు. అనంతరం పొదలకూరు మండలంలోని సూరాయపాళెంలో గ్రామోత్సవం అనంతరం స్వామివారు ఆలయానికి చేరుకున్నారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

భీమేశ్వరుడికి అశ్వవాహన సేవ

మండలంలోని వంగల్లు భీమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున కామాక్షిదేవి, భీమేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను అశ్వవాహనంపై ఉంచి గజపూలమాలలతో అలంకరించిన అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.


లింగసముద్రంలో భక్తుల కోలాహలం


ఉలవపాడు : శివపార్వతుల కల్యాణంలో మాజీ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

హనుమంతుడి గ్రామోత్సవం

స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమంతుని గ్రామోత్సం వైభవంగా జరిగింది. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవంలో మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.


సంగం : నంది వాహనంపై ఊరేగుతున్న శ్రీకామాక్షిదేవి, సంగమేశ్వరస్వామి

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం : ఇంటూరి


టీడీపీ సభ్యత్వం కలిగిన వారికి గుర్తింపు కార్డుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే కార్యకర్తల సంక్షేమం కోసం పాటుపడే ఏకైక పార్టీ తెలుగుదేశం అని, అందువల్లే అత్యధిక సభ్యత్వాలు కలిగిన రాజకీయ పార్టీగా టీడీపీ రికార్డు సృష్టించిందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. టీడీపీ ఇటీవల చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సభ్యత్వాలు స్వీకరించిన కార్యకర్తలకు గుర్తిం పు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయం లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ కోటి సభ్యత్వాల మైలురా యిని దాటడం ద్వారా దేశంలోనే అత్యధిక సభ్యులు కలిగిన రాజకీయ పార్టీగా టీడీపీ ఆవిర్భవించిందన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్య త్వం కలిగిన కార్యకర్తల కు అనుకోని ప్రమాదం జరిగితే వారి కుటుంబాలకు అండగా ఉండేం దుకు రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేస్తుండటమే గాక ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా కూడా కార్యకర్తల కుటుంబాల ఉన్నతికి అనేక కార్యక్రమాలు అమలు చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహం, జనిగర్ల నాగరాజు, పిడికిటి వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, ముచ్చు శ్రీను, వడ్డెళ్ల రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కోర్టు పరిధిని కుదించడం శోచనీయం

● కందుకూరు బార్ అసోసియేషన్ వినతి

కందుకూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్‌కోర్టు పరిధిని కుదించడం శోచనీయమని, ఇక్కడి నుంచి తప్పించి ఒంగోలు కోర్టు పరిధిలోకి చేర్చిన నాలుగు మండలాలను తిరిగి కందుకూరులోనే కొనసాగించేలా న్యాయశాఖ ఉత్తర్వులు ఇవ్వాలని కందుకూరు బార్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీవీ సుబ్బారావు, సంపత్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు మామిళ్లపల్లి మల్లికార్జునరావు, బెజవాడ కృష్ణయ్య చౌదరి, చిడిపోతు హరికృష్ణ, బీవీ మురళీకృష్ణ, షేక్ షంషుద్దీన్, పెట్లూరి మురళి తదితరులు కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ ఉత్తర్వులు అమలైతే కందుకూరుకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కందుకూరు సబ్ కోర్టు పరిధిలో కందుకూరు నియోజకవర్గంతో పాటు కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు, జరుగుమల్లి, కొండపి, సింగరాయకొండ మండలాలు ఉండగా సింగరాయకొండలో నూతనంగా ఏర్పాటు చేసిన అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో ఆ నాలుగు మండలాలను చేర్చారని తెలిపారు. అయితే నూతనంగా ఏర్పడిన కోర్టు అప్పీలు పరిధిని కూడా కందుకూరు కోర్టుకు కాకుండా ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టుకు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం శోచనీయమని వివరించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాగా కందుకూరు కోర్టు పరిధిని కుదించడం పట్ల కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి మండలి ప్రతినిధులు తోకల వెంకటేశ్వర్లు, పాలేటి కోటేశ్వరరావు, పులిచర్ల వెంకటసుబ్బారెడ్డి, నరేష్ రాజా తదితరులు ఒక ప్రకటనలో అసంతృప్తి వ్యక్తం చేశారు. కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపటంతోనే రాష్ట్రంలోనే అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌కు తీరని అన్యాయం జరిగిందన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

సంగం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సంగం పంచాయతీలోని తిరుమనతిప్ప సర్వే నెంబరు 252లో ఉన్న ఖాళీ స్థలం ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులు గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో ఎవరూ ప్రవేశించరాదు. ప్రవేశించిన శిక్షార్హులని హెచ్చరిక బోర్డులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సంధ్య, వీఆర్వో మోహన్ ఉన్నారు.

ఆంజనేయ విగ్రహం ఊరేగింపు

వింజమూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్రబెల్లిపాలెంలో ప్రతిష్ఠించనున్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని గురువారం మేళతాళాలతో బాజాభజంత్రీలతో ఎర్రబెల్లిపాలెం యూత్ ఊరేగింపు నిర్వహిం చింది. వచ్చేనెల 2వతేదీ ఎర్రబెల్లిపాలెం సెం టర్‌లో విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నట్లు తెలిపారు.

4 నుంచి విజ్ఞాన ప్రదర్శనలు

ఉదయగిరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 4వ తేదీ నుంచి మండలంలోని 3 నుంచి 9వ తరగతి విద్యార్థులకు స్థానిక సికిందర్ పిక్చర్ ప్యాలెస్‌లో చిల్డ్రన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో భాగంగా విజ్ఞాన ప్రదర్శనలు జరగనున్నట్లు ఎంఈవో-2 శ్రీనివాసులు గురువారం తెలిపారు. అందులో భాగంగా సీఆర్‌ఎంటీలతో సమీక్షా సమావేశం నిర్వహించి విధివిధానాలను వివరించారు. ప్రతి విద్యార్థి రూ.30లు చెల్లించి టిక్కెట్ తీసుకోవాల్సి ఉందన్నారు.

దారి ఆక్రమణపై ఫిర్యాదు

కలువాయి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంధతీయవాడలోని పురాతన మంచినీటి బావికి ఇరువైపులా ఉన్న దారిని కొందరు ఆక్రమించారని గురువారం తహసీల్దారుకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి కూడా ఈవిషయమై ఫిర్యాదు చేశారు. పరిశీలించి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

నేడు రిక్షాలు, ఆటోల వేలం

ఉదయగిరి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం శిథిలమైన రిక్షాలు, ఆటోలకు ఆత్మకూరు డివిజనల్ పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ కరీముల్లా గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగలవారు వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

విమర్శలు మాని, అభివృద్ధికి సహకరించాలి

● ఎమ్మెల్యే కాకర్లపై ఆరోపణలను ఖండించిన టీడీపీ నేతలు


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న మండల టీడీపీ సీనియర్ నాయకులు

సీతారామపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్‌పై నిరాధారమైన ఆరోపణలు మాని అభివృద్ధికి సహకరించాలని మండల టీడీపీ నేతలు సూచించారు. గురువారం మండల పరిధిలోని పొలంగారిపల్లి వద్ద టీడీపీ సీనియర్ నాయకుడు, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల మాజీ కన్వీనర్ ముత్తంశెట్టి చెన్నకేశవులు, మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్‌రాజు, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తూ దూసుకుపోతున్న ఎమ్మెల్యే కాకర్లపై అసత్య ప్రసారాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వహక అధికార ప్రతినిధి జాషువా, ముస్లిం మైనారిటీ నాయకుడు షేక్ బాబు, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, సర్పంచ్ ఆదినారాయణ, ఎడమ ప్రవీణ్, రమణయ్య, కాశీరత్తయ్య, ఇజ్రాయిల్ వెంగళశెట్టి వెంకట్రావు, పాల్గొన్నారు.

సోమశిల జలాశయం నిర్వహణపై నిర్లక్ష్యం తగదు

● ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరి

అనంతసాగరం ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నిర్వహణ పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి సూచించారు. గురువారం సోమశిలలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొందరు అధికారులు విధుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఉన్నతాధికారులకు సమస్యను వివరించి నిరంతర పర్యవేక్షణ జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు మేలు జరి గేలా ఎలాంటి కార్యక్రమాలు చేయలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల సంక్షేమం జరుగుతోందన్నారు. ఉత్తర, దక్షిణ కాలువలతో పాటు డెల్టా పరిధిలో చివరి ఆయకట్టు వరకు నీరు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం శ్రీకారం

● కార్యకర్తలకు ముగిసిన శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో కార్యకర్తలు తయారు చేసిన బోధనోపకరణాలు (ఫైల్)

ఉదయగిరి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. అంగన్‌వాడీ పిల్లలు పాఠశాలల్లో చేరడానికి ముందే వాళ్లని వివిధ అంశాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించింది అందులో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు కార్యకర్తలకు జ్ఞానజ్యోతి పేరుతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ పరివర్తన సహాయ పథకంలో భాగంగా 120 రోజుల పాటు దశల వారీగా శిక్షకులు విద్యావిధానం ప్రాముఖ్యత, అభ్యసన విధానం, సమగ్రాభివృద్ధి, పాఠ్య ప్రణాళిక, పిల్లల్లో శారీరక, మేథ, కళాత్మకాభివృద్ధి, ఎదుగుదల, ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణ వంటివి పెంచడమే లక్ష్యంగా శిక్షణ ఇచ్చి ధ్రువపత్రం అందజేశారు. జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వాటి పరిధిలో 2,934 అంగన్‌వాడీ ఉన్నాయి. అందులో 229 మినీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,673 కార్యకర్తలు పనిచేస్తున్నారు. వారందరికీ ఇటీవల శిక్షణ ఇచ్చారు.

మెరుగైన విద్యాబోధనే లక్ష్యం: సీడీపీవో

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన విద్యాబోధన చేయడమే లక్ష్యంగా జ్ఞానజ్యోతిపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చినట్లు సీడీపీవో సునీత తెలిపారు. శిక్షణ కార్యక్రమాలు ఇటీవల ముగిశాయని, శిక్షణలో కార్యకర్తలు నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో ఖచ్చితంగా అమలు చేయాల్సి ఉందన్నారు.

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


దివ్యాంగుల క్యాంపులో పాల్గొన్న అధికారులు

కావలి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఏ.మహమ్మద్ అయూబ్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్పీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఎమ్పీ డీవో శ్రీదేవి ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులకు క్యాంపు ఏర్పాటు చేసి వారికి అవసర మైన పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపు నకు 120 మంది హాజరుకాగా వారిలో 46 మందికి ఉప కరణాలు తప్పనిసరి అని గుర్తించిన జిల్లా అధికారులు వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. లబ్ధిదారులకు ప్రక టించిన తేదీలలో వారికి అవసరమైన ఉప కరణాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏ కొండమ్మ, వెంకటాచలం కాంపోజిట్ రీజనల్ సెంటర్ కో ఆర్డినేటర్ రామాంజులు, దివ్యాంగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

బెల్టుదుకాణంపై దాడి

● 11 మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం సర్వాయపాలెంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారికంగా మద్యం అమ్ముతున్న బెల్టు దుకాణంపై గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఎస్ఐ దేవిక నిర్వహించిన దాడుల్లో మద్యం అమ్మకాలు చేస్తున్న సూరగాని వెంకట్రావును అదుపులోకి తీసుకుని అతని వద్ద 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

2న కంటి వైద్యశిబిరం

కావలి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కావలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన పట్టణంలోని రామమూర్తి పేటలోని షిర్డీసాయిబాబా మందిరంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ బాధ్యులు డాక్టర్ మాధవరెడ్డి, స్వర్ణలత, మొగల్‌సలీం బేగ్‌లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సుశీల నేత్రాలయం వారు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆరోగ్యశ్రీ కార్డుపై కంటి శస్త్రచికిత్సలు చేస్తారని పేర్కొన్నారు. కావలి డివిజన్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.